J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 38 20.2.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

### మోడీ - బాబు ఒకే మాట.. ఒకే బాట

## సాంకేతికతే ఇక తోడు అభివృద్ధికి ఏఐ జోడు!



- ‘కృత్రిమ మేధ’ దారిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- విజన్-2047 లక్ష్యంగా మోదీ, చంద్రబాబు దూకుడు

ప్రపంచాన్ని శాసిస్తున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) సత్తాని, సామర్థ్యాన్ని ఒడిసిపట్టేందుకు, కృత్రిమ మేధతో ప్రజా జీవనాన్ని పరుగులు పెట్టించేందుకు రంగం సిద్ధమౌతోంది. మనిషికి ప్రతిపనిలో నేనున్నానంటూ గుర్తుచేస్తున్న ఏఐ పరిజ్ఞానాన్ని వ్యవసాయ, వ్యాపార రంగాలకే కాకుండా, విద్య, వైద్య ఆరోగ్య రంగాలకూ అనుసంధానించాల్సిన అవసరం కనిపిస్తోంది. ఈ క్రమంలో ఏఐ నిపుణుల తోడ్పాటు దేశానికి అంతో అవసరం. ఈ విషయాన్ని గుర్తించే యువశక్తి కేంద్రంగా అభివృద్ధిని వాయువేగంతో పరిగెత్తించేందుకు అటు భారత ప్రధాని మోడి, ఇటు ఆంధ్రా ముఖ్యమంత్రి చంద్రబాబు వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగానే కేంద్రప్రభుత్వ నేతృత్వంలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-*2026* సమ్మిట్ ఢిల్లీలో ప్రారంభం కాగా, నవ్యాంధ్రలో బిల్‌గేట్స్ పౌండేషన్ సహకారంతో సాంకేతిక విప్లవానికి నాందీప్రస్తావన జరిగింది. తద్వారా అభివృద్ధిలో తమది ఒకేబాట, ఒకే మాట అన్నట్లుగా మోడీ, చంద్రబాబు ద్వయం ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.

2లో



## శ్రీసిటీ సిగలో.. మరో ఆణిముత్యం

- వెయ్యికోట్ల పెట్టుబడితో ‘క్యారియర్’ ఏసీల కర్మాగారం
- ప్రత్యక్షంగా వెయ్యిమందికి, పరోక్షంగా 2వేల మందికి ఉపాధి

ఇప్పటికే *31* దేశాలకి చెందిన *240*కి పైగా పరిశ్రమలతో ప్రఖ్యాత పారిశ్రామికవాడగా అంతర్జాతీయ ఖ్యాతి గడించిన శ్రీసిటీ సిగలో మరో ఆణిముత్యం మెరవబోతోంది. ఏసీల తయారీలో ప్రపంచవ్యాప్తంగా పేరెన్నికగన్న దిగ్గజ కంపెనీ ‘క్యారియర్’ సంస్థ తమ ఏసీల కర్మాగారం ఏర్పాటుకు శ్రీసిటీతో ఇటీవల ఒప్పందం చేసుకోవడం విశేషం. తిరుపతి జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ సమక్షంలో ‘క్యారియర్’ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుందరేశన్ నారాయణన్, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డిలు ఆమేరకు ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు.

3లో



# పరీక్షలు.. దగ్గరికి వచ్చేశాయ్!..

## • ఈనెల 23 నుండి ఇంటర్.. మార్చి 16 నుండి పది పరీక్షలు!



పరీక్షలు దగ్గరకు వచ్చేయడంతో విద్యార్థుల్లో టెన్షన్ మొదలైంది. రేయింబవళ్లు చదువుకుంటూ పరీక్షలకి సిద్ధమవుతున్నారు. ఈనెల 23 నుండి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు, మార్చి 16వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో జిల్లా అధికారులు అందుకు తగ్గ ఏర్పాట్లన్నీ పటిష్టంగా చేస్తున్నారు. ఇటీవల కలెక్టరేట్‌లోని డిఆర్ఓ ఛాంబర్‌లో ఈ పరీక్షలకి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్ అధికారులతో సమీక్షించి, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా జరిగే విధంగా, అలాగే ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటుచేయాలని కూడా ఆయన సూచించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీటి వసతి సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ అధికారులు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునేలా బస్సులను నడపాలని సూచించారు.

ఈనెల 23 నుంచి మార్చి 24 తేదీ వరకు జరుగనున్న ఇంటర్ పరీక్షలకు ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 53404 మంది విద్యార్థులు హాజరవుతారని భావిస్తూ, అందుకు తగ్గట్టుగా జిల్లాలో 81 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా, మార్చి 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు 28589 మంది విద్యార్థులు హాజరవుతారని, అందుకు వీలుగా మొత్తం 174 సెంటర్లను ఏర్పాటుచేస్తున్నామని అధికారులు తెలిపారు. వాటితోపాటు మార్చి 2 తేదీ నుంచి 13వ తేదీ వరకు ఏపి ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు, మార్చి 16 నుంచి 28 వరకు ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఇంటర్మీడియట్ పరీక్షల అధికారి వరప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

## నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

# 20వ రక్తదాన శిబిరం

### ఎన్‌బీకెఆర్ డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 91వ జయంతి సందర్భంగా ఈనెల 20న వారిని స్మరించుకుంటూ ఏర్పాటుచేసే రక్తదాన శిబిరాన్ని ఆయన కుమారుడు.. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల అధినేత, నేదురుమల్లి ఫౌండేషన్ ఛైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించనున్నారని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి కళాభవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి స్మారకంగా చేసే పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతిఏటా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, గతంలో ఈ శిబిరాల ద్వారా అత్యధికంగా రక్త యూనిట్లను సేకరించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో ఉన్నందుకు, గతంలో గవర్నర్ చేతులమీదుగా అవార్డు కూడా లభించిందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాకాడు, విద్యానగర్‌లో గతంలో ఆర్ఓ ప్లాంట్‌ని కూడా ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. వెంకటగిరిలో పలు వాటర్‌ట్యాంక్‌లను, అంబులెన్స్ సదుపాయాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. అంతేకాక, ఎన్‌బీకెఆర్ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు, వారు కళాశాలకి చెల్లించాల్సిన ఫీజులో కొంతభాగాన్ని నేదురుమల్లి ఫౌండేషన్ వారే ఇస్తున్నారని కూడా ఆయన తెలిపారు. ఈనెల 20న జరిగే రక్తదాన శిబిరం, ఇతర సేవా కార్యక్రమాల్లో నేదురుమల్లి అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# సాంకేతికతే ఇక తోడు - అభివృద్ధికి ఏఐ జోడు!

(మొదటిపేజీ తరువాయి)

'ఎక్కడ మీరున్నా, అక్కడ నేనున్నా'.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)కి ఈ మాట సరిగ్గా సరిపోతుంది. పొద్దున్నే మొబైల్ ఆన్‌చేసి రోజువారీ వ్యవహారాలను ప్రారంభించినప్పటి నుంచి రాత్రి పడుకునే ముందు గుడ్‌నైట్ చెప్పేవరకు ఏఐ మనిషికి తోడునీడగా మారుతోంది. ఫేస్ రీడింగ్‌తో అయినా, వేలిముద్రతో అయినా మొబైల్ ఆన్ చేయాలంటే ఏఐ కావాలి. సోషల్ మీడియాలో యాప్స్ ఓపెన్ చేయాలంటే ఏఐ కావాలి. మనం చూసే కంటెంట్‌కు సంబంధించిన అంశాలన్నీ వరుసగా స్క్రీన్ పై ప్రత్యక్షం కావాలంటే ఏఐ కావాలి. ఆఫీస్‌కి వెళ్లాక మనం గూగుల్‌లోకి వెళ్లి సర్చ్ చేసే అంశం క్షణాల్లో మనకు కనిపిస్తోందంటే దానికి కారణం డేటా మొత్తాన్ని విశ్లేషించే ఏఐ. మన సెల్‌ఫోన్‌లో ఏర్పాటు చేసిన చిప్‌లు, కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసిన డేటాను తనకుతానుగా ఇది తొలుత పరిశీలిస్తుంది. తర్వాత క్షణాల్లో అవగాహన చేసుకుని, సమస్యకు పరిష్కార మార్గాన్ని అందించేందుకు ఉపయోగపడుతుంది. ఇంకా చెప్పాలంటే ఓ వ్యక్తి, రైల్వే రిజర్వేషన్‌కు సంబంధించిన బెస్ట్ మెథడ్, యాప్ ఏదో తెలుసుకోవాలంటే ఏఐని అడిగితే స్పష్టమైన పరిష్కారం లభిస్తుంది. ఏ రకం జబ్బుకు ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో, ఏం మందులు వాడాలో డాక్టర్ కంటే మిన్నగా, తొందరగా మన రిపోర్టులను సైతం స్కాన్ చేసి చెప్పగల నేర్పరితనం ఏఐకి ఉంది.

ఇంకా రైతులకు ఏఏ భూముల్లో ఎలాంటి పంటలు సాగుచేయవచ్చో, ఏ ఎరువులు వెయ్యాలో, ఏ పురుగుల మందు వాడాలో, ఏ పంటకు ఏ ప్రాంతంలో గిట్టుబాటు ధర ఉందో, ఏ పంట ఎక్కడ మార్కెట్ చేయగలమో అన్ని విషయాలనూ ఏఐ క్షణాల్లో విశ్లేషించి వివరంగా మనకందిస్తోంది. అందుకే ప్రపంచ దేశాలన్నీ ప్రస్తుతం ఏఐ పరిశోధనలు, చిప్‌ల తయారీ, డేటా సెంటర్ల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయి. ఈ విషయాన్ని మోడీ - చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వాలు కూడా సకాలంలో గుర్తించినట్లే కనిపిస్తోంది. అందుకే అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా జీవితంలో ఏఐ భాగస్వామ్యాన్ని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

### బడ్జెట్‌ల రూపకల్పనలోనే స్పష్టత..

రోజువారీ కార్యకలాపాల్లో ఏఐ వినియోగాన్ని, ప్రాధాన్యతను పెంచి తద్వారా ప్రజల జీవితాల్లో నాణ్యతను, సరళతను, సౌఖ్యాన్ని పెంపొందించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకు ఇటీవల ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్‌నే ఉదహరణగా చెప్పుకోవచ్చు. సాధారణంగా బడ్జెట్‌లో తమ పార్టీ ప్రభుత్వాలు ఉండే రాష్ట్రాలకు కేటాయింపులు అధికంగా ఉంటాయి. అలాగే ఎన్నికలు ఉండే రాష్ట్రాలకు సబ్సిడీలు, కొత్త ప్రాజెక్టులు, పన్ను మినహాయింపులు, గ్రాంట్‌లు అందజేయడం కూడా సహజమే. కానీ ఈసారి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఇలాంటివేమీ కనిపించలేదు. ఇంకా చెప్పాలంటే ఎలాంటి హంగూ, ఆర్భాటాలు లేవు. ఏ రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీలు వంటివి కనిపించలేదు. దీనికి కారణం వికసిత్ భారత్-2047 కోసం కేంద్ర రూపొందించుకున్న ప్రణాళికే. ఎందుకంటే ఈసారి బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలైన రోడ్లు, జాతీయ రహదారులు, పోర్టులు, విమానాశ్రయాలు వంటి అంశాలకు, రక్షణ రంగానికి సంబంధించిన ఆయుధాలు, ఎయిర్‌క్రాఫ్టులతో పాటూ వివిధ పరికరాల కొనుగోలుకు తొలి ప్రాధాన్యత ఇచ్చారు. దీని కారణంగా భవిష్యత్‌లో నేషనల్ హైవేలలో టోల్ ట్యాక్స్, సిగ్నలింగ్, ట్రాఫిక్ సమస్య వంటి అంశాల్లో ఏఐ వినియోగాన్ని పెంచి తద్వారా రవాణా రంగాన్ని మరింత వేగవంతం చేయనున్నారు. అలాగే రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాల్లో రోబోలు, ఏఐ పోలీసింగ్ వ్యవస్థలు ప్రవేశపెట్టి భద్రతను మరింత కట్టుదిట్టం చేయనున్నారు. ఇటీవల విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్రవేశపెట్టిన ఏఎస్‌పీ అర్జున్ అనే ఏఐ పోలీస్ ఈ కోవలోకే వస్తుంది. ఇది పోలీస్ రికార్డుల్లో ఉండే దొంగలను, వివిధ కేసుల్లో ఉండే నిందితులను ఫేస్ రికగ్నేషన్ ద్వారా గుర్తించి వెంటనే కంట్రోల్ రూంకు సమాచారం అందిస్తుంది. ఇది 24 గంటలూ నిర్విరామంగా పని చేస్తుంది.

అలాగే రేర్‌ఎర్త్ మినరల్స్ కారిడార్ పేరుతో ఏపీ, ఒడిశా, కేరళ వంటి రాష్ట్రాల్లో ఉండే తీరప్రాంతాలు, ఇసుక నేలల్లో మైనింగ్ ద్వారా అరుదైన ఖనిజాలను వెలికి తీసి ఏఐ చిప్‌ల రూపకల్పనకు తొలి అడుగు వేయాలని నిర్ణయించారు. తద్వారా ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు మరింత ప్రోత్సాహం లభించనుంది. అలాగే ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచి విద్యుత్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించనున్నారు. దీంతో తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించే సౌలభ్యాన్ని ప్రజలకు కలిగించనున్నారు. అలాగే ఏఐతో ఆపరేట్ చేసే కార్లు, వాహనాలు భవిష్యత్‌లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఇది దోహదమవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇక రాష్ట్ర బడ్జెట్‌ను కూడా పరిశీలిస్తే విద్యా రంగానికి 32వేల కోట్లతో అధిక ప్రాధాన్యత దక్కింది. తద్వారా విద్యలో ఏఐ వాడకాన్ని గణనీయంగాపెంచి, కొత్త ఆన్‌లైన్ కోర్సులను అందుబాటులోకి తేనున్నారు. అలాగే విద్యార్థి సామర్థ్యాలను అంచనా వేయడానికి, కొత్తకొత్త యాప్స్‌ను పరిచయం చేయడానికి ఏఐ ఉపయోగపడనుంది. అలాగే విద్యార్థి దశ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగం కోసం దరఖాస్తుల రూపకల్పన, సమర్పణ వంటి అంశాల్లో తప్పుల సవరణకు ఏఐ పెద్దఎత్తున ప్రయోజనకరం కానుంది. ఇక విశాఖపట్నం, అమరావతి, తిరుపతి రీజియన్లకు సైతం కేటాయింపులు భారీగానే చేశారు. ఇంచుమించు ఒక్కో రీజియన్‌కు దాదాపు రూ.30వేల కోట్ల చొప్పున నిధుల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో అమరావతిలో క్వాంటం వ్యాలీ, ఏఐ ఆధారిత సేవల పెంపుదల, విశాఖపట్నంలో ఐటీ సేవల పెంపుదలకు చర్యలు, రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటులో కూడా ఏఐని ముఖ్య ఆయుధంగా వినియోగించనున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026తో కొత్త అధ్యాయం!

తాజాగా ఢిల్లీలో నిర్వహించిన ప్రపంచస్థాయి కృత్రిమ మేథ సదస్సు (ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో-2026) భారత సాంకేతిక యవనికపై కొత్త అధ్యాయం సృష్టించేందుకు మార్గం సుగుమం చేసింది. 600 వరకు స్టార్టప్‌లు, 13 దేశాలకు చెందిన ఏఐ పెవిలియన్లు (సముదాయం), 20 దేశాల అధినేతలు, 60 దేశాలకు చెందిన మంత్రులు, దిగ్గజ కంపెనీలకు చెందిన 40 మంది సీఈవోలు, వందలాదిగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఇందులో పాలు పంచుకున్నారు. వివిధ రంగాల్లో ఏఐ తీసుకొచ్చే మార్పులు, వాటికి అనుగుణంగా ప్రపంచ దేశాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. అలాగే భవిష్యత్‌లో ఏఐ రంగం మరింత బలపడితే ఉద్యోగ, ఉపాధి కల్పనకు సంబంధించి ఎదురయ్యే సవాళ్లు, ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉండే భారత్‌పై దాని ప్రభావం వంటి అంశాలపై కూలంకుషంగా సమాలోచనలు చేశారు.

ఇక చంద్రబాబు ప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ విప్లవానికి నాంది పలికే క్రమంలో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ నేతృత్వంలోని గేట్స్ ఫౌండేషన్ కలిసి ముందుకు సాగాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే బిల్‌గేట్స్‌ను అమరావతికి రప్పించి వివిధ అంశాల్లో రాష్ట్ర పురోగతి, సంస్కరణల కోసం తీసుకుంటున్న చర్యలను వివరించింది. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధిలో ఏఐ వినియోగాన్ని పెంపొందించడం, దానికి గేట్స్ ఫౌండేషన్ సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. తద్వారా స్వర్ణాంధ్ర విజన్ 2047కు గొప్ప ముందడుగు పడుతుందని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలిసింది. ఏదేమైనా అటు హస్తినలో మోదీ, ఇటు అమరావతిలో చంద్రబాబు నాలుగో పారిశ్రామిక విప్లవం 4.0గా గుర్తింపు పొందిన ఏఐకి తొలి ప్రాధాన్యత ఇచ్చి పాలనను పరుగులు పెట్టించేందుకు సిద్ధమైనట్లు కనిపిస్తోంది. ఈ మహాయజ్ఞం దినదిన ప్రవర్ధమానం చెంది అనుకున్న లక్ష్యాలను సాధిస్తే, దేశ రూపురేఖలే మారిపోతాయనడంలో సందేహం లేదు. అప్పుడు గాంధీజీ కలలుగన్న, గ్రామస్వరాజ్యం సాకారమై పల్లెల్లోనే పంటలకు అవసరమైన నాణ్యమైన విత్తనాల తయారీ, భూసార పరీక్షలు, సస్యరక్షణ చర్యలకు సంబంధించిన సమస్త సమాచారం అందుబాటులోకి వస్తుంది. దిగుబడి, మార్కెటింగ్ వంటి సౌకర్యాలు, సదుపాయాలు, కనీస మద్దతు ధరలను ఏఐ సహకారంతో రైతులే తెలుసుకునే అవకాశం కలుగుతుంది.



బిల్‌గేట్స్‌తో ఆత్మీయంగా నారా చంద్రబాబునాయుడు

జాతీయ రహదారులపై వెలిగే లైట్లు సున్నా వ్యయంతో సోలార్ ద్వారా వెలుగులు విరజిమ్ముతాయి. ఎలక్ట్రిక్ వాహనాల ద్వారా కాలుష్యంలేని ప్రయాణం, వేగంగా గమ్యాన్ని చేరుకునే అవకాశం కలుగుతుంది. నగరాల్లో ట్రాఫిక్ రద్దీ వంటి సమస్యలకు ఏఐ ద్వారానే చెక్‌చెప్పే అవకాశం లభిస్తుంది. కావాల్సిన మందులను రోగే స్వయంగా ఏఐ ద్వారా తెలుసుకుని, వినియోగించుకునే పరిస్థితి ఏర్పడుతుంది. కల్తీరహిత వస్తుసామగ్రి, నాణ్యత ఉన్న వస్తువులను వినియోగదారులే ఏఐతో సులభంగా గుర్తించే అవకాశం కలుగుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఏఐ టెక్నాలజీని దేశ ప్రజల రోజువారి జీవితంలో భాగం చేసేందుకు ప్రపంచ దేశాలతోపాటు మోడీ, చంద్రబాబు వేస్తున్న అడుగులు రేపటి దేశ భవిష్యత్‌కు దశ-దిశను నిర్దేశిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. "మేరా భారత్ మహాన్"!..

## ఉదయగిరి తలరాత మార్చనున్న..

# రక్షణ రంగ పరిశ్రమ

- 500 కోట్ల పెట్టుబడితో 'ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్' యూనిట్
- ముఖ్యమంత్రి దార్శనికత, డాక్టర్ సతీష్‌రెడ్డి కృషితో సాకారం



ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో డాక్టర్ సతీష్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)

నెల్లూరు జిల్లాలోని వెనుకబడిన మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజక వర్గం ఇకపై దేశ రక్షణ రంగ చిత్రపటంలో కీలక కేంద్రంగా మారనుంది. సాగునీరు లేక, పరిశ్రమలు రాక దశాబ్దాలుగా వలసల బాట పట్టిన ఈ ప్రాంత యువతకు సొంత గడ్డపైనే కొలువులు కల్పించాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంకల్పం అతిత్వరలోనే కార్యరూపం దాల్చనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దార్శనికతకు డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, ఏపీ ఏరో డిఫెన్స్ అడ్వైజర్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి విశేషకృషి తోడవ్వడంతో జిల్లాలోని దుత్తలూరు మండలం ముత్తరాసపల్లిలో భారీ రక్షణ రంగ ఉత్పత్తుల కేంద్రం ఏర్పాటు కాబోతోంది. సుమారు 450ఎకరాల విస్తీర్ణంలో 500 కోట్ల భారీ పెట్టుబడితో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ లిమిటెడ్ ఈ యూనిట్‌ను స్థాపించనుంది. పరిశ్రమలు వస్తేనే ఉపాధి.. ఉపాధి ఉంటేనే అభివృద్ధి అనే నినాదంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెట్ట ప్రాంత అభివృద్ధిపై తనకున్న చిత్తశుద్ధిని చాటుకుంటూ, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ద్వారా కేవలం వారం రోజుల్లోనే భూమి కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయించారు. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 2,000 మంది యువతకు ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలుస్తోంది.

### అంతరిక్ష, రక్షణ రంగాలలో కీలకం కానున్న ఉదయగిరి :

దేశ రక్షణ శాఖలో అత్యున్నత పదవులు నిర్వహించిన డాక్టర్ సతీష్‌రెడ్డి, కేంద్ర రక్షణ సంస్థలతో తనకున్న అనుబంధంతో ఈ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులు త్వరగా లభించేలా సమన్వయం చేశారు. శ్రీహరికోటలోని షార్ కేంద్రానికి ఉదయగిరి ప్రాంతం చేరువలో ఉండటం వల్ల భవిష్యత్తులో ఈ ప్రాంతం ఒక 'డిఫెన్స్ హబ్'గా మారనుంది. ఇస్రో రాకెట్లతో పాటు అగ్ని, పృథ్వీ వంటి క్షిపణులకు అవసరమైన హెచ్.టి.పి.బి ఇంధనం ఇక్కడే ఉత్పత్తి కానుండటం విశేషం. దీనితో పాటు ఏటా 4లక్షల మందుగుండు రౌండ్లు, 20వేల టన్నుల ప్రొపెల్లెంట్ తయారీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించడం వల్ల వలసలు తగ్గి, మెట్ట ప్రాంత నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఈ పారిశ్రామిక విప్లవంతో ఉదయగిరి అభివృద్ధిలో సరికొత్త చరిత్రను సృష్టించబోతోందని భావిస్తున్నారు.

## 26న..దేవిరెడ్డి శారద వర్ధంతి



అల్లూరు మండలం నార్త్‌మోపూరు గ్రామానికి చెందిన సమాజసేవాభిలాషి స్వర్గీయ దేవిరెడ్డి శారద 9వ వర్ధంతి కార్యక్రమం ఈనెల 26న దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌లో జరుగనుంది. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రాంగణంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేస్తున్నారు. ఆమె పేరుతో ఇప్పటికే ట్రస్ట్‌వారు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న విషయం తెలిసిందే. పేద విద్యార్థులకు హైస్కూలు ఏర్పాటు చేయడంతో పాటు, సుమారు 300మంది పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫారంలు అన్నీ ట్రస్ట్ వారే సమకూరుస్తున్నారు. అదే విధంగా అక్కడ ఏర్పాటుచేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా వేలాదిమందికి ఉచిత వైద్యసేవలు కూడా అందజేస్తున్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నెలకొల్పిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా వందలాదిమంది మహిళలకు కుట్టులో శిక్షణ, ఇంకా ఇతరత్రా జీవనోపాధుల కోర్సుల్లో యువతీ యువకులకు శిక్షణలు ఇస్తున్నారు. దేవిరెడ్డి శారద భర్త దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వారి కుటుంబసభ్యుల నేతృత్వంలో ఈ సేవా కార్యక్రమాలు జరుగనున్నాయని ట్రస్టు నిర్వాహకులు తెలియజేశారు.

## కోటి 50 లక్షలతో పెరుమాళ్లపాడులోని..

# నాగేశ్వరాలయాన్ని పునఃనిర్మిస్తాం

- మంత్రి ఆనం



ఆత్మకూరు సమీపంలోని పెరుమాళ్లపాడులో పురాతన శ్రీ నాగేశ్వర స్వామి శివాలయాన్ని పునర్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి చెప్పారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇటీవల ఆయన ఆత్మకూరు నియోజకవర్గంలో పర్యటించారు. పెరుమాళ్లపాడులో ఎంపీపీ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, చరిత్రాత్మకమైన నాగేశ్వర స్వామి ఆలయానికి, గ్రామస్తులందరి ఆమోదం మేరకు పెన్నా నదికి సమీపంలో నూతన ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అందుకు 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కూడా గుర్తించాలని అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. తొలుత 2021-22లో ఈ ఆలయాన్ని గ్రామంలోని యువత గుర్తించారని, ఇసుకతిన్నెల్లో కూరుకుపోయిన ఈ ఆలయాన్ని అధికారులు పూడిక తీసి పరిశీలించినట్లు చెప్పారు. ఆలయంలో వెతికితే గణపతి, శివలింగం, నాగ ప్రతిష్టలు బయల్పడ్డాయని, అత్యంత పురాతనమైన ఆలయం కావడంతో దేవాదాయ శాఖ, పురావస్తు శాఖ అధికారులతో చర్చించి ఆగమ శాస్త్రం ప్రకారం నూతన ఆలయ నిర్మాణానికి రూ. 1.50కోట్లతో ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా అవసరమైన నిధులను కూడా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పెరుమాళ్లపాడు గ్రామాన్ని కూడా అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# శ్రీసిటీలో.. 'క్యారియర్' కర్మాగారం

(మొదటిపేజీ తరువాయి)




తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న 'క్యారియర్' ఎం.డి సుందరేశన్ నారాయణన్, శ్రీసిటీ ఎండి డా. రవీంద్ర సన్నారెడ్డి

"శ్రీసిటీ".. ఆ పేరు వింటేనే పారిశ్రామికరంగంలో ఒక పెద్ద సంచలనం. ఒకప్పట్లో పారిశ్రామికంగా ఎలాంటి సదుపాయాలు లేని వెనుకబడిన ఆ ప్రాంతం, ఇప్పుడు శ్రీసిటీ రాకతో కళకళలాడుతోంది. ఒక్క పరిశ్రమ స్థాపనే ఎంతో కష్టతరంగా ఉం టున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఒకటి కాదు రెండు కాదు, ఏకంగా 240కి పైగానే పరిశ్రమలు నెలకొల్పడమంటే అనితర సాధ్యం, అనన్యసామాన్యం. వాటిలో 200 పరిశ్రమలు నిర్మాణాలు పూర్తయి, ఉత్పత్తులు అందిస్తుండగా, మరో 40 పరిశ్రమలు నిర్మాణల్లో వివిధ దశల్లో ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో దాదాపు 68వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగాయంటే అతిశయోక్తి కాదు. వారిలో కూడా సగం మందివరకు మహిళలే ఉండడం, మహిళా సాధికారతకు శ్రీసిటీ చేయూతనందిస్తుండడం గొప్ప విశేషం! ఈ నేపథ్యంలో 'క్యారియర్ ' వంటి దిగ్గజ కంపెనీ తమ కొత్త యూనిట్‌ని శ్రీసిటీలో స్థాపించడానికి ముందుకు రావడం రాష్ట్ర పారిశ్రామిక రంగంలో ఒక పెద్ద ముందడుగు. అంతే కాదు, శ్రీసిటీ పారిశ్రామిక ప్రస్థానంలో ఇదొక మైలురాయి.

### 1000కోట్ల పెట్టుబడితో.. 'క్యారియర్'

'క్యారియర్' అంటే, ఎయిర్ కండిషనర్ల తయారీలో ప్రపంచవ్యాప్త పేరెన్నికగన్న సంస్థ. హీటింగ్, వెంటిలేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్(హెచ్‌వీఏసీ) రంగంలో అగ్రగామిగా ఉన్న 'క్యారియర్ ఎయిర్ కండిషనింగ్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్ అనే ఈ సంస్థ, తాజాగా శ్రీసిటీలో తమ కొత్త తయారీ కేంద్రం స్థాపనకు రంగం సిద్ధం చేసుకుంది. దాదాపు వెయ్యికోట్ల రూపాయల పెట్టుబడితో, 36ఎకరాల విస్తీర్ణంలో శ్రీసిటీలో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమ ద్వారా, కనీసం వెయ్యిమందికి పైగానే ఉద్యోగాలు, పరోక్షంగా మరో రెండువేల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సులభతర వ్యాపారం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) మాత్రమే కాకుండా వేగవంతమైన అమలు (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) విధానానికి కట్టుబడి ఉందని తెలిపారు. శ్రీసిటీ హెచ్‌వీఏసీ రంగంలో ప్రధాన కేంద్రంగా ఎదుగుతోందని, 'క్యారియర్' పెట్టుబడి దీనికి నిదర్శనమని అన్నారు. ఈ ప్లాంట్ పచ్చదనం ఆధారిత తయారీ విధానాలను అనుసరించి, గణనీయమైన ఉపాధి అవకాశాలను సృష్టించి, తమ సంస్థకు విస్తృత స్థాయిలో తయారీ సామర్థ్యాన్ని అందిస్తుందని 'క్యారియర్' సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సుందరేశన్ నారాయణన్ చెప్పారు. మార్కెట్ వృద్ధికి సైతం రానున్న తమ కొత్త కర్మాగారం తోడ్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ఎం.డీ డా. రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, క్యారియర్ పెట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దార్శనిక నాయకత్వంలో రాష్ట్ర పారిశ్రామిక పురోగతిపై విశ్వాసాన్ని, నమ్మకాన్ని పెంచుతుందని తెలిపారు. ఈ పరిశ్రమ స్థాపనతో ఉపాధి అవకాశాలు పెరిగి, ఆధునిక తయారీ మరియు సుస్థిర ఆవిష్కరణల కేంద్రంగా శ్రీసిటీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన ఆకాంక్షించారు.

తొలుత, 'క్యారియర్' సంస్థ ప్రతినిధులు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో ఉన్నతస్థాయి చర్చలు జరిపిన అనంతరం, ఏపీ పరిశ్రమలకు అన్ని విధాలా అనుకూల వాతావరణం కలిగిన ప్రాంతంగా శ్రీసిటీలో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే మనదేశంలోని హర్యానాలో ఉన్న తమ తయారీ కేంద్రానికి తోడుగా ఈ కొత్త యూనిట్ ఏర్పాటు కానుందని వారు సంతోషం వ్యక్తం చేశారు.



లాయర్
ఫిబ్రవరి 20, 2026

# మన 'మాతృభాష'ను..మనం కాపాడుకోవాలి

'భాష'..అనేదే లేకుంటే, మానవుడు ఏ ఆదిమానవుడి లాగానో ఉండిపోయేవాడేమో!.. హాయిగా మాట్లాడుకోవడం, పాడుకోవడం, నవ్వుకోవడం వగైరాలన్నీ మనిషికి గొప్ప వరాలు. మనసులోని భావాలను మాటల్లో చెప్పుకోగలుగుతున్నాం కనుకనే, మానవ ప్రగతి అద్భుతమై, అజేయమై.. అప్రతిహతంగా సాగిపోతోంది. అసలు మాటలన్నిటినీ మనం.. మొట్ట మొదటిగా తల్లి నుంచే వింటున్నాం. తల్లి ఒడే..తొలి బడిగా మాటలు నేర్చుకుంటున్నాం. మాట్లాడడానికి భాషే ముఖ్యం. అందుకే, మాతృభాష అన్నది ఒక జీవనదిగా.. ఒక అమృత భాషగా జీవితాంతం మనతోడు నీడగా ఉంటోంది. భాష అనేది..ఒకరినుంచి మరొకరికి, ఒక తరం నుంచి మరో తరానికి నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. భాషకి..మనకి ఉన్న అనుబంధం అంతా ఇంతా కాదు. భాషాజ్ఞానమే లేకుంటే బతుకంతా అంధకారబంధురమే అవుతుంది. అందులోనూ మన తెలుగుభాష ఎంతో గొప్పది. మరెంతో ప్రాచీనమైనది.. అంతకంటే మధురమైనది కూడా. ద్రావిడ భాషల్లో ఒకటైన తెలుగుభాష 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా ప్రఖ్యాతి చెందడం తెలుగుభాష గొప్పతనం. అయితే, రానురాను నేటి ఆధునిక యుగంలో పాశ్చాత్య సంస్కృతుల ప్రభావంతో క్రమేణా మన మాతృభాషకి ప్రాధాన్యత తగ్గిపోతోంది.సెల్‌ఫోన్‌లు వచ్చాక అరచేతిలోకి వచ్చి ప్రపంచమంతా మనకెంతో దగ్గరైనా, మాతృభాషను మాత్రం మనం దూరం చేసుకుంటూనే ఉన్నామా అనిపిస్తోంది. చిన్నతనం నుంచి బడుల్లో కంఠతా పట్టే పద్యాలు, పాటలు, పాఠాలు అన్నీ మాతృభాష అయిన మన తెలుగు భాష బాగా మాట్లాడేందుకు ఎంతో ఉపకరిస్తాయి. అయితే, చిన్నప్పుడు తెలుగులో చదువుకున్నా, ఉన్నత విద్యల వద్దకు వచ్చేటప్పటికి తెలుగు కాకుండా ఇతర భాషల్లో పాఠాలు చదువుకోవడం, తెలుగుకు బదులు మరికొందరు తమకు ఇష్టమైన భాషలను ఎంచుకోవడంతో పాటు, తెలుగులో మార్కులు తక్కువ వస్తాయేమోననే అపోహ కూడా తెలుగును దూరం చేస్తోందని చెప్పవచ్చు. ఒక్కమార్కు తగ్గినా పరీక్షల్లో పాసుకాకపోతే చివరికి ఏమైపోతామోననే భయంతో విద్యార్థులు అనేకమంది తెలుగు చదువుకోవడం మానేస్తున్నారు. కారణాలేమైతేనేం.. తెలుగులో చదువుకుంటే, పెద్ద పెద్ద ఉద్యోగాలు రావనే అపోహ కూడా కొందరిలో ఉంటోంది. ఎందుకైనా మంచిదని చిన్నతనం నుంచే తల్లితండ్రులు ఆంగ్లభాషపై మోజుతో పిల్లలను ఆంగ్లమాధ్యమంలో చదివిస్తున్నారు. అమ్మా-నాన్నా అనే మధురమైన మాటలను కూడా వదిలేసి, 'మమ్మీ-డాడీ' అంటేనే అదో గొప్పగా అనుభూతి చెందుతున్నారు. అసలు, తెలుగంటేనే చిన్నచూపు చూస్తూ, తెలుగువారైనప్పటికీ తెలుగు మాట్లాడడం చిన్నతనంగా భావించేవారు కూడా లేకపోలేదు. కానీ, వాస్తవానికి అమ్మభాషపై పట్టు ఉన్నవాళ్ళు ఇతర భాషలని కూడా సునాయాసంగా నేర్చుకుని, అనేక రంగాల్లో అత్యుత్తమంగా రాణిస్తున్నవారెందరో ఉన్నారని విశ్లేషకులు చెప్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాల్లో మాతృభాషలో చదువుకున్న దేశాలే బాగా పురోగతిని సాధించాయని కూడా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. అయినా..ఇతరభాషలు నేర్చుకోవడం పట్ల ఎవరికీ అభ్యంతరం ఉండనక్కర లేదు. అదేమీ తప్పు కాదు. ఒకవేళ ఉపాధి, ఉద్యోగావకాశాల కోసం ఎవరన్నా ఇతర భాషలను నేర్చుకున్నా, ఉగ్గుపాలతో పాటు తల్లి మనకందించిన మాతృభాషని మాత్రం ఏనాటికీ విస్మరించకూడదన్న విషయం గుర్తుంచుకుంటే చాలు. మనమెంత స్థాయికి ఎదిగినా.. మాతృమూర్తిని, మాతృభూమిని, మాతృభాషని ఏనాటికీ మరచిపోకూడదు. ఈ సందర్భంలో, తెలుగురాష్ట్రాల ప్రభుత్వాలు కూడా పాఠశాలల్లో, కళాశాలల్లో తెలుగుభాషని తప్పనిసరి పాఠ్యాంశంగా ప్రవేశపెట్టి ప్రోత్సహించాలి. ఉన్నత విద్యల్లో కూడా తెలుగు ప్రాధాన్యత ఉంటేనే తెలుగును అందరూ నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతారని గ్రహించాలి. అన్నిటికంటే ప్రధానంగా, మాతృభాషే విద్యకు పునాది అని గమనించాలి. ఆలోచించడం, అర్థం చేసుకోవడం సమస్యలను పరిష్కరించడం వంటి నైపుణ్యాలు మాతృభాషలో వేగంగా అభివృద్ధి చెందుతాయని భాషావేత్తలు వెల్లడిస్తున్నారు. అంతేకాదు, మాతృభాషలో మన సంస్కృతి సంప్రదాయాలు నిక్షిప్తమై ఉంటాయి కనుక, మాతృభాషని కాపాడుకోవడమంటే, మన సంస్కృతిని మనం కాపాడుకోవడమే అవుతుంది.

భావ వ్యక్తీకరణకు ఉత్తమ సాధనం మాతృభాషే. అదొక ప్రత్యేకమైన జ్ఞానసంపద. దానిని కాపాడుకోవడం మనందరి కర్తవ్యంగా భావించాలి. మన మాతృభాష ఏనాటికీ మృతభాష కాకుండా, అమృతభాషగా కలకాలం నిలిచేలా భాషని ప్రోత్సహించాలి. మనం ఎక్కడున్నా సరే.. మన మాతృభాషకి చెయ్యెత్తి జైకొట్టాలి!...

**-ఫిబ్రవరి 21, అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం**

# రుతుక్రమ ఆరోగ్యం ఒక 'హక్కు'!

మనసులో మాట 85

గడప దాటి బయటకు వచ్చి, చదువులోనూ, ఉద్యోగాల్లోనూ దూసుకుపోతున్న నేటి మహిళా ప్రపంచానికి సుప్రీంకోర్టు ఒక చరిత్రాత్మక కానుకను అందించింది. రుతుక్రమ ఆరోగ్యం (Menstrual Health) అనేది కేవలం ఒక వ్యక్తిగత సమస్యగానో లేదా ప్రభుత్వం ఇచ్చే ఏదో ఒక సంక్షేమ పథకం లాగానో చూడకుండా, దానిని ఒక 'ప్రాథమిక హక్కు' (Fundamental Right)గా గుర్తించడం ఒక గొప్ప సామాజిక మలుపు. భారతదేశ న్యాయ చరిత్రలో 'డాక్టర్ జయ ఠాకూర్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ఇటీవల వెలువడిన ఈ తీర్పు, కేవలం ఆరోగ్య సూత్రాలకు పరిమితం కాకుండా, విద్యార్థినుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసింది.

దశాబ్దాలుగా మన సమాజంలో పీరియడ్స్ అనే అంశం 'గుసగుసల'కే పరిమితమైంది. పాఠశాలల్లో బాలికలు ఈ సమయంలో ఎదుర్కొనే ఇబ్బందులు వర్ణనాతీతం. సరైన మరుగుదొడ్లు లేకపోవడం, నీటి వసతి కరువవ్వడం, ప్యాడ్లు అందుబాటులో లేకపోవడం వల్ల లక్షల మంది బాలికలు మధ్యలోనే చదువు మానేస్తున్నారు. సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొన్నట్టు, "ఒక అమ్మాయి పీరియడ్ ఆమె చదువుకు ముగింపు పలకకూడదు." చదువు కొనసాగించడంలో ఎదురయ్యే ఇటువంటి అడ్డంకులను తొలగించడం ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ క్రమంలో పాఠశాల యాజమాన్యాలు విద్యార్థినుల అవసరాలను గుర్తించి, తగిన రీతిలో స్పందించాల్సిన అవసరం ఉంది.

## రాజ్యాంగబద్ధమైన గుర్తింపు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి మహిళా గౌరవప్రదంగా జీవించే హక్కును కలిగి ఉంది. గౌరవం అంటే కేవలం ప్రాణాలతో ఉండటం కాదు; కనీస అవసరాలు తీరడం, ఆత్మగౌరవంతో బతకడం. రుతుక్రమ సమయంలో అపరిశుభ్రమైన బట్టలు లేదా ఇతర పద్ధతులు వాడాల్సి రావడం ఆమె గౌరవానికి భంగం కలిగించడమే. ముఖ్యంగా ఆర్టికల్ 21A (ఉచిత నిర్బంధ విద్య)ను ప్రస్తావిస్తూ.. పాఠశాలల్లో మరుగుదొడ్లు, నీటి వసతి, శానిటరీ ప్యాడ్లు అందుబాటులో లేకపోవడం వల్ల పలువురు బాలికలు పాఠశాలలకు గైర్హాజరవుతున్నారని లేదా చదువు మానేస్తున్నారని కోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. విద్యను అందించడం అంటే కేవలం పుస్తకాలు ఇవ్వడం మాత్రమే కాదు, ఆ విద్యను అభ్యసించడానికి అవసరమైన అన్ని అడ్డంకులను తొలగించడం కూడా ప్రభుత్వ బాధ్యత అని కోర్టు తేల్చి చెప్పింది. ఇది రాజ్యాంగపరమైన బాధ్యత కాబట్టి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కొరతను సాకుగా చూపడానికి వీల్లేదు.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుండి 12వ తరగతి చదువుతున్న బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్లు అందించడం ఇకపై ప్రభుత్వ బాధ్యత. ఈ తీర్పు కేవలం సిద్ధాంతాలకు పరిమితం కాలేదు. క్షేత్రస్థాయిలో అమలు కావాల్సిన పనులపై కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

పర్యావరణానికి హాని కలగని విధంగా పర్యావరణ హితమైన ప్యాడ్ల తయారీ మరియు పంపిణీపై దృష్టి సారించాల్సి ఉంది. కేవలం ప్యాడ్లు ఇస్తే సరిపోదు, వాటిని పారేయడానికి (Disposal) సరైన యంత్రాలు, శుభ్రమైన మరుగుదొడ్లు ఉండాలి. ప్రతి పాఠశాలలో 'మెన్‌స్ట్రువల్ హైజీన్ మేనేజ్‌మెంట్' (MHM) కేంద్రాలను ఏర్పాటు చేసి, అక్కడ అత్యవసర సమయాల్లో వాడటానికి అదనపు దుస్తులు, ప్యాడ్లు, ఇతర పారిశుధ్య సామాగ్రిని సిద్ధంగా ఉంచాలి. దీనికోసం ప్రతి జిల్లాలో ఒక ప్రత్యేక అధికారిని నియమించి, సౌకర్యాల కల్పనను నిరంతరం పర్యవేక్షించాలని న్యాయస్థానం ఆదేశించింది.

## సవాళ్లను అధిగమించాలి

చట్టం చేయడం ఒక ఎత్తైతే, దానిని అమలు చేయడం మరో ఎత్తు. దేశవ్యాప్తంగా జరిగిన వివిధ సర్వేల ప్రకారం, రుతుక్రమ నిర్వహణకు సరైన సదుపాయాలు లేకపోవడం వల్ల ఏడాదికి సగటున 20% నుండి 25% మంది బాలికలు పాఠశాలలకు సెలవు పెడుతున్నారు. ఇది వారి వార్షిక పరీక్షల ఫలితాలపై, ఉన్నత విద్యపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ తీర్పు ద్వారా విద్యా వ్యవస్థలో ఉన్న ఈ లోపాన్ని శాశ్వతంగా సరిదిద్దవచ్చు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరతను అధిగమించేందుకు... కేంద్ర ప్రభుత్వం మహిళలకు ఉద్దేశించిన వివిధ పథకాలతో అనుసంధానం చేస్తూ బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. సామాజికంగా పీరియడ్స్ సమయంలో ఉండే మూఢనమ్మకాలను తొలగించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకం. పాఠశాల విద్యాబోర్డులు తమ పాఠ్యప్రణాళికల్లో మార్పులు చేసి, దీనిపై శాస్త్రీయ అవగాహన కల్పించాలి.

సుప్రీంకోర్టు తీర్పు కేవలం కాగితాల మీద ఆదేశం మాత్రమే కాదు; అది ఒక సామాజిక సంస్కరణకు పునాది. రుతుక్రమం వల్ల ఏ ఆడపిల్ల కూడా విద్యకు, ఉజ్వల భవిష్యత్తుకు దూరం కాకూడదు. ప్రభుత్వం, విద్యా సంస్థలు, సమాజం కలిసికట్టుగా అడుగు వేసినప్పుడే మన దేశ భవిష్యత్తు దృఢంగా ఉంటుంది. ఈ తీర్పును చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడే భారత్ నిజమైన 'ఆడబిడ్డల దేశం'గా మారుతుంది. ఇది ఆరోగ్యవంతమైన, విద్యావంతమైన నవ సమాజం వైపు పడిన అత్యంత సాహసోపేతమైన అడుగు.



**- తుమ్మల బాల గంగాధర్ తిలక్**

# చిన్నజీయర్ స్వామి వ్యాఖ్యలు అసంబద్ధం, అర్థరహితం!

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

"నాకు పిచ్చి కుదిరింది రోకలి తలకి చుట్టరా" అన్న నానుడికి ప్రత్యక్ష సాక్షి చిన్న జీయర్ స్వామి. కేవలం వైష్ణవ మత ప్రచారానికి ఏర్పాటు చేయబడిన చినజీయర్ మఠానికి ప్రస్తుత పీఠాధిపతి అయిన ఆయన అవివేకానికి అప్రస్తుత ప్రకటనలకు విచారిస్తున్నాము. చతురామ్నాయ పీఠాల వ్యవస్థాపకులు శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ విద్యారణ్యస్వామి వారు అని వారు అంటున్నారు. కానీ, ఆ విద్యారణ్య స్వామి వారు దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారద పీఠానికి 12వ మహా సంస్థానాధీశ్వరులు. ఆ విషయం చిన్న జీయర్‌స్వామికి అర్థం కాలేదా, అవగాహన లేదా..? నేటిదాకా చినజీయర్ స్వామి శివ ద్వేషిగానే గుర్తింపబడ్డారు. కానీ, నేడు మతద్వేషిగా తనకు తానే ముద్ర వేసుకున్నారు. శివ కేశవ భేదం లేకుండా గాణాపత్యులు, శాక్తేయులు, సౌర మతస్థులు అని తేడా చూపకుండా పంచాయతన దేవతలను ఏర్పాటుచేసి షణ్మతస్థాపన ఆచార్యగా సార్థక నామదేయుడైన జగద్గురు శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్య శ్రీశ్రీశ్రీ ఆదిశంకరుల వారిని వైష్ణవ మతస్థుడిగా ప్రకటించడం దారుణం. మహావాక్యం ప్రమాణాలుగా, చతుర్వేదముల సాక్షిగా భారతదేశం నాలుగు మూలల్లో కేవలం ధర్మప్రచార నిమిత్తం సనాతన ధర్మ పరిరక్షణార్థం చతురామ్నాయ పీఠాలను స్థాపించి తన ప్రధాన శిష్యులని ఆ మఠాధిపతులుగా శ్రీ శంకర భగవత్పాదులు నియమించారన్నది నిర్వివాదాంశం. చిన్న జీయర్ స్వామి తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరుతున్నాము.

**స్వామి సమయానందనాథ**
**మేనేజర్, ఆదిశంకర ధ్యాన మందిరం, నెల్లూరు.**

# ఆ ఇద్దరు అధికారులకి జీవితం నేర్పిన వింత పాఠం!

అధికార పదవి కన్నా జనాదరణ, ప్రజల విశ్వాసం వంటివి చాలా గొప్పవి. సమాజంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అంటే మేధస్సు, క్రమశిక్షణ, దూరదృష్టికి మారుపేరు అని ప్రతీక. అలాంటి ఇద్దరు ప్రముఖులే జయప్రకాష్ నారాయణ, లక్ష్మీ నారాయణ. ఒకరు ఐఏఎస్, మరొకరు ఐపీఎస్. ఈ ఇద్దరు తమ ఉన్నత ఉద్యోగాలను వదిలి రాజకీయాల్లోకి వచ్చారు. ఇద్దరి లక్ష్యం ఒక్కటే, సమాజంలో సమూల మార్పు తేవడం. కానీ, వారి ప్రయత్నం వృథా ప్రయాసగానే మిగిలిపోయింది. ఇద్దరూ ఆశించిన స్థాయిలో రాజకీయాల్లో విజయం సాధించలేకపోయారు. దీనిని ఘోర పరాజయంగా చూడడం కన్నా ఇది వారికి జీవితం నేర్పిన పాఠంగా అభివర్ణించవచ్చేమో! కేవలం తెలివితేటలు ఉన్నంత మాత్రాన రాజకీయాలలో రాణించడం సాధ్యం కాదు. ప్రజల మనోభావాలని, వారి అంతరంగ అభిప్రాయాలని అర్థం చేసుకోవడం రాజకీయాల్లో చాలా ముఖ్యం. నేరుగా వారి కష్టసుఖాలలో పాలుపంచుకోవాలి. చాలామంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తమ పదవీ విరమణ అనంతరం ప్రజాసేవలో సఫలమయ్యారు. శాసన సభ్యులుగా, పార్లమెంటు మెంబర్లుగా ప్రజాసేవలో తరిస్తున్నారు. కానీ, వాళ్లంతా సిద్ధాంత భావజాలంతో ప్రజా జీవితంలోకి రాలేదు. సొంతంగా పార్టీలు పెట్టలేదు. ప్రజాదరణ వున్న పార్టీలని వేదికలుగా చేసుకుని వాటి గొడుగు కింద తమ రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. జయప్రకాష్ నారాయణ, లక్ష్మీనారాయణలు కూడా అదే బాట ఎంచుకొని ఉంటే, కనీసం కొంతలో కొంతైనా రాజకీయాలలో రాణించేవారేమో. వీరిద్దరూ భవిష్యత్ వర్గాలకి మార్గదర్శకులుగా మిగిలిపోయారు తప్ప, ఆదర్శం కాలేకపోయారు!

**యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.**

DEVIREDDY SARADA CHARITABLE TRUST

# కీ॥శే॥ దేవిరెడ్డి శారద గారి 9వ వర్ధంతి

DSR Group

మంచికి మారుపేరుగా నిలచి, ఆప్యాయత అనురాగాలతో...
మా గుండెలలో నిలిచిపోయిన అమృతమూర్తి



స్వర్గీయ దేవిరెడ్డి శారద గారు

## 9వ వర్ధంతి

(తేది 26-02-2026 గురువారము)
సందర్భంగా
స్మరించుకుంటూ
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భర్త
**దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి**

**కుమార్తెలు - అల్లుళ్ళు**
ప్రతిమ - పెళ్లకూరు చైతన్యరెడ్డి
షర్మిళ - డాక్టర్ దొడ్ల ప్రతాప్ రెడ్డి
**మనుమడు :** పెళ్ళకూరు సాహిత్‌రెడ్డి
**మనుమరాలు :** దొడ్ల క్రితి

**మరుదులు - చెల్లెళ్లు**
దేవిరెడ్డి దశరథరామిరెడ్డి - అమరావతి
దేవిరెడ్డి రఘురామిరెడ్డి - శోభ
దేవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి - రాజేశ్వరి
మరియు కుటుంబసభ్యులు

## దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్టు ద్వారా అందించిన సేవలు



### DSCT - హైస్కూలు

6వ తరగతి నుండి 10వ తరగతి వరకు 300 మంది పేద విద్యార్థి, విద్యార్థినులకు నాణ్యమైన ఉచిత విద్యతో పాటు మధ్యాహ్నం భోజనము, పుస్తకములు మరియు యూనిఫారంలు ఉచితముగా అందజేస్తున్నాము.



### DSCT - ప్రైమరీ హెల్త్ సెంటర్

హెల్త్ సెంటర్ ద్వారా 34017 మందికి ఉచిత వైద్య సేవలు అందించినాము మరియు 14045 మందికి తక్కువ ధరతో బ్లడ్ టెస్ట్‌లు నిర్వహించబడినవి. ట్రస్ట్ ద్వారా ప్రముఖ వైద్య నిపుణులతో 6 ఉచిత మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించబడినవి. వీటి ద్వారా 1491 మంది ఉచిత వైద్యసేవలు అందుకున్నారు. 4 బ్లడ్ బ్యాంక్ క్యాంపుల ద్వారా 267 మంది రక్త దానం చేసినారు.



### DSCT - స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా 329 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వబడినది.
30 మంది మహిళలకు బ్యూటీపార్లర్ కోర్సులో శిక్షణ ఇవ్వబడినది.
60 మంది మహిళలకు జర్దోసి మగ్గం కోర్సులో శిక్షణ ఇవ్వబడినది.
మరియు 278 మంది యువతీయువకులకు కంప్యూటర్ శిక్షణ మరియు 67 మందికి ట్యాలి కోర్సులో శిక్షణ ఇవ్వబడినది.
భవిష్యత్తులో ట్రస్టు ద్వారా యువతీ యువకులకు మరెన్నో నైపుణ్య శిక్షణలు ఇవ్వబడును.



### DSCT - కన్వెన్షన్ సెంటర్

కన్వెన్షన్ సెంటర్ నందు వివాహాది శుభకార్యములు, రిసెప్షన్లు, వార్షికోత్సవాలు మరియు వ్యాపార సంబంధిత సమావేశాలు నిర్వహించబడినవి.

**తేది : 26-02-2026 గురువారము DSCT ట్రస్టులో మెగా రక్తదాన శిబిరం జరుగును.**

దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్, పురిణి, ఇందుపూర్ క్రాస్ రోడ్డు, నార్త్ మోపూరు గ్రామం, అల్లూరు మండలం.
సెల్ : 9154854754 www.devireddytrust.com

# దర్గాల్లో నిత్యాన్నదానం ప్రారంభిస్తాం

## వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్



కమిటీ సభ్యులకి నియామకపత్రాలను అందజేస్తున్న వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ దర్గాల్లో నిత్యాన్నదానం కార్యక్రమం ప్రారంభించేందుకు కృషిచేస్తామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. ఈనెల 17న ఆయన నెల్లూరులోని తమ నివాసంలో పలు మసీదులకు కమిటీలు నియమించి, సభ్యులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వక్ఫ్‌స్థలాలు పేదవారికి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. దర్గాలు, మసీదుల నుంచి వచ్చే ఆదాయాన్ని పేద ముస్లిం బిడ్డల చదువులకు, ఆడబిడ్డల వివాహాలకు ఉపయోగించాలని సూచించారు. నెల్లూరు బారాషహీద్ దర్గా, కోటమిట్టలోని షాదీమంజిల్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

### అగ్నిప్రమాద బాధితులకు..

# మంత్రి నారాయణ.. 50వేల సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్

నెల్లూరు నగరం 44వ డివిజన్ అంజుమన్ వీధిలో ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా షాహీనా అనే మహిళ ఇల్లు దగ్ధమైన ఘటనపై మంత్రి నారాయణ మానవతా హృదయంతో స్పందించారు. బాధితులకు 50వేల సాయం ప్రకటించారు. మంత్రి ఆదేశాల మేరకు ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మంత్రి నారాయణ పంపిన 50వేల రూపాయలను వారికి ఆర్థికసాయంగా అందజేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే పేద కార్యకర్తలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న మంత్రి నారాయణ నెల్లూరుకు రాగానే బాధిత కుటుంబానికి పక్కాఇల్లు వంటి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటారని వారికి తెలిపారు.

# ప్లాస్టిక్ విక్రయాలపై..దాడులు

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ నందన్ ఆదేశాలతో, ప్రజారోగ్యం అధికారులు ఈనెల 17న నెల్లూరులోని చిన్నబజారు, పెద్దబజారు, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లోని పలు హోల్‌సేల్ దుకాణాలపై దాడులు నిర్వహించి, సుమారు 4వందల కేజీల నిషేధిత ప్లాస్టిక్‌ని స్వాధీనం చేసుకున్నారు. దుకాణాల యజమానులకు మొత్తంగా లక్షా 40వేల రూపాయల వరకు జరిమానా విధించారు.




# నెల్లూరు కబుర్లు

# శివయ్య సేవలో.. నారాయణ దంపతులు



మూలాపేట శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి దంపతులు

నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరీదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. రాష్ట్ర పురపాలక మంత్రి పొంగూరు నారాయణ-రమాదేవి దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆ పరమేశ్వరుని ప్రార్థించినట్లు ఈ సందర్భంగా నారాయణ చెప్పారు. ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, మామిడాల మధు, ఆలయ ఛైర్మెన్ పుట్టా అజయ్, పాలక మండలి సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# వెట్టిచాకిరీని నిర్మూలించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

వెట్టిచాకిరీని నిర్మూలించాలని, ఎవరైనా వెట్టిచాకిరీ చేయించుకుంటే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హెచ్చరించారు. వెట్టిచాకిరీ నిర్మూలన వ్యవస్థ చట్టం అమలులోకి వచ్చి 50ఏళ్ళు పూర్తయిన సందర్భంగా, దేశవ్యాప్తంగా వజ్రోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, ఆమేరకు నెల్లూరుజిల్లాలోనూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈనెల 17న వెట్టిచాకిరీ నిర్మూలనకి సంబంధించిన గోడపత్రికలను కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో కలెక్టర్ ఆవిష్కరించారు. బాలకార్మికులను, ఇతర కార్మికులను వెట్టిచాకిరీకి ఉపయోగించుకుంటే చర్యలు తప్పవన్నారు. జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయులు.. దామోదరం సంజీవయ్య



దామోదరం సంజీవయ్యకి నివాళులర్పిస్తున్న సాంఘిక సంక్షేమ అధికారులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి తొలి దళిత ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా పనిచేసి, పేదలు-దళితుల అభ్యున్నతికి అపార సేవలందించిన దామోదరం సంజీవయ్య ఆదర్శప్రాయులని, ఆయన ఆశయాల బాటలో అందరూ నడవాలని జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో సాంఘికసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య 105వ జయంతిని నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి, దళిత సంఘాల నాయకులు స్వర్ణ వెంకయ్య, సుబ్బారావు, కొప్పోలు రమణయ్య, బాల చెన్నయ్య, సుబ్బయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా రిజిస్ట్రార్‌గా..రవి జోసఫ్

అల్లూరు సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న రవి జోసఫ్‌కు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కలిగించి, జిల్లా రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

### జెఇఇ మెయిన్స్‌లో..

# 'విశ్వసాయి' విజయఢంకా



ఇటీవల ఎన్‌టీఏ విడుదల చేసిన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయఢంకా మోగించారని కళాశాల ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ తెలిపారు. తమ కళాశాల విద్యార్థిని సిహెచ్.శరణ్య 97.42 పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో తన ప్రతిభ నిరూపించుకోవడం జరిగిందని, అదేవిధంగా జి.మహిధర్‌రెడ్డి 95.58, పి.గుణసాయి స్వేజన్ 94.98, బి.శ్రీనివాసులు 94.54, కె.లాస్యలహరి 94.5 పర్సంటైల్‌తో అగ్రశ్రేణిలో నిలిచారన్నారు. మరో 7గురు విద్యార్థులు 90 పర్సంటైల్‌కి పైగా, 36 మంది 80 పర్సంటైల్ పైగా సాధించారని, మొత్తం 56 మందికిపైగానే విద్యార్థులు ఈ పరీక్షల్లో క్వాలిఫై అయ్యారని ఆయన వివరించారు. తమ విద్యార్థులు ఒక లక్ష్యంతో, ప్రణాళికబద్ధంగా సాధన చేశారు కాబట్టే మంచి ఫలితాలు సాధించారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయాలపై విద్యాసంస్థల వైస్ ఛైర్మెన్ కృష్ణమోహన్, డైరెక్టర్ శివసంకేత్‌లు మాట్లాడుతూ, అధ్యాపకుల సహకారంతో రెండో విడత పరీక్షల్లో కూడా తమ విద్యార్థులు అత్యంత ప్రతిభతో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అభినందన కార్యక్రమంలో జూనియర్ కళాశాల డీన్‌లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లపై..వెల్లువెత్తిన నిరసనలు



ఎర్రజెండాలు పట్టి నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఇటీవల జరిగిన వామ పక్షాల ఆందోళనల కార్యక్రమంలో, కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్‌ల(కార్మిక చట్టాలు)పై నిరసనలు పెల్లుబుకాయి. నెల్లూరులో కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, రైతు-ఉద్యోగ సంఘాల నాయకత్వంలో ఎర్రజెండాలు చేతబట్టి భారీర్యాలీ నిర్వహించారు. లేబర్ కోడ్‌లో కేంద్రం కార్మికుల హక్కులను కాలరాసిందంటూ నాయకులు దుయ్యబట్టారు. కార్పొరేట్ రంగానికి కేంద్రం కొమ్ము కాస్తూ, కార్మికుల ప్రాథమిక హక్కులను తుంగలో తొక్కుతోందంటూ ఆందోళన వెలిబుచ్చారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, సీపీఎం నాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, సీఐటియు నాయకులు గోగుల శ్రీనివాసులు, సీపీఐ నాయకులు అరిగెల నాగేంద్రసాయి, దామా అంకయ్య, రైతుసంఘాల నాయకులు కోటిరెడ్డి, షానవాజ్‌లతో పాటు పలువురు మహిళా సంఘాల నాయకురాళ్లు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి రుద్రాభిషేకాలు



మహాశివరాత్రి రుద్రాభిషేకాలు, అర్చనలతో నెల్లూరు పొగతోటలోని ఆదిశంకర ధ్యానమందిరం హోరెత్తింది. రాత్రి 10 గంటల నుండి 16 సోమవారం ఉదయం 5 గంటల వరకు మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకార్చనలు భక్తిప్రపత్తులతో కొనసాగాయి. మందిర కమిటీ అధ్యక్షులు గుండా పంతుల రామసుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో కొనసాగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద కుమార్, మేనేజర్ స్వామి సమయానందనాథ, ఉపాధ్యక్షురాలు గుండా పంతుల ప్రత్యూష, కమిటీ సభ్యురాలు పాలేటి చాయకుమారి, చక్రాల వారి ట్రస్ట్ ధర్మకర్తలు మందిర కమిటీ సభ్యులు జిల్లా బ్రాహ్మణ సంఘ సభ్యులు తంగిరాల వెంకటశ్రీకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

# అనుకున్నది సాధించాడు!

## • కోటంరెడ్డి అంటే ఏంటో నిరూపించుకున్నాడు



ఆమంచర్ల 'భారత్ సింధూర్ పార్క్'ను పరిశీలిస్తున్న కోటంరెడ్డి సోదరులు

అనుకున్నది సాధించాడు..కోటంరెడ్డి అంటే ఏంటో..సత్తా నిరూపించుకున్నాడు. ఒకప్పట్లో తాను పోరాడిన పారిశ్రామిక పార్కును ఏర్పాటు గావించి తన కలను సాకారం చేసుకున్నాడు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన కోసం నెల్లూరు రూరల్‌లోని ఆమంచర్లలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుచేయాలని గతంలో ఎంతగా కోరినా, అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం, దానికోసం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోరాటం చేయడం అందరికీ గుర్తుండే ఉంటుంది. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన కల సాకారమైంది. 30 ఎకరాల విస్తీర్ణంలో, దాదాపు 7 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన ఆ పార్కు నిర్మాణం పూర్తికావడంతో ఆయన అనుకున్నది సాధించుకున్నట్లయింది. ఎట్టకేలకు తన చిరకాల కోరిక నెరవేరిందంటూ ఆయన సంతోషం వ్యక్తం చేస్తున్నారు కూడా. నెల్లూరు నగర ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, స్థానిక టీడీపీ నాయకుడు..తన సోదరుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులతో కలసి శ్రీధర్‌రెడ్డి.. ఈనెల 16న ఆ పార్కును సందర్శించారు. 'భారత్ సింధూర్ ఎంఎస్ఎంఇ పార్క్'గా ఈ పార్కుకు నామకరణం చేయనున్నామని ఆయన చెప్పారు. దీంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇది నెల్లూరు రూరల్ ప్రజల ఆకాంక్ష, అని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యామంత్రి లోకేష్‌ల ఆశీస్సులతో పార్క్ నిర్మాణం పూర్తయిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నెత్తినోరు బాదుకున్నా ఈ పార్కు విషయాన్ని పట్టించుకున్న నాథుడు లేడని, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ని పదేపదే అడిగినా ఫలితం లేకపోయిందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు.

# శ్రీసిటీలో.. స్వదేశీ జాగరణ మంచ్' జాతీయ కన్వీనర్




సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్.సుందరం, రవీంద్ర సన్నారెడ్డి

అంతర్జాతీయ పారిశ్రామికవాడ.. శ్రీసిటీని ఇటీవల ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్, ఆర్థిక నిపుణులు, 'స్వదేశీ జాగరణ మంచ్' జాతీయ కన్వీనర్ ఆర్.సుందరం సందర్శించారు. పరిశ్రమల ప్రతినిధులను ఉద్దేశించి..'మారుతున్న గ్లోబల్ పరిస్థితుల్లో భారత ఆర్థిక వ్యవస్థ' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిణామాలను ప్రస్తావిస్తూ, మనదేశ ఆర్థిక వ్యవస్థలోని బలోపేతమైన నిర్మాణాత్మక విధానాలను ఆయన వివరించారు. భారతదేశ ఆర్థిక భవిష్యత్తు దేశీయ సామర్థ్యాల బలోపేతం, ఆవిష్కరణల ఆధారిత వృద్ధి, విధాన స్థిరత్వంపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, పరిశ్రమ వర్గాలను చైతన్యవంతులను చేయడానికి నిపుణులతో తరచూ ఇలాంటి కార్యక్రమాల నిర్వహణ ఉపయోగకరమన్నారు.

### తల్లిదండ్రులను దూషించేవారికి..

# కఠిన శిక్షలు పడాలి

## అసెంబ్లీలో సోమిరెడ్డి



జన్మనిచ్చిన తల్లితండ్రులను దూషించేవారికి కఠినశిక్షలు పడాలి. ఆమేరకు చట్టసవరణ జరగాలి అని మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు కోరారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, ఎవరైనా సరే తల్లిదండ్రులను కించపరిచేలా మాట్లాడితే రాజకీయాలకు అతీతంగా శిక్షించేందుకు ప్రత్యేక చట్టం తేవాల్సిన అవసరం ఉందన్నారు. దేవుళ్ళ లాంటి తల్లిదండ్రులను దూషించే వారికి నాన్ బెయిలబుల్ సెక్షన్లు వర్తించేలా చట్టంలో మార్పులు తేవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీ నేతల తీరును ప్రస్తావిస్తూ, తమ ప్రత్యర్థి పార్టీల నాయకులను బూతులు తిట్టినా, తల్లిదండ్రులను అవమానించేలా మాట్లాడి తప్పుచేసినోళ్లను మాత్రం వాళ్ళు ఇంటికెళ్లి పరామర్శిస్తారని, తల్లిదండ్రులను దూషించిన వారిని కనీసం మందలించకుండా భుజాల్ని తట్టి ప్రోత్సహించే నాయకుడు జగన్‌రెడ్డి తప్ప మరొకరు లేరేమో అని ఆయన అన్నారు. గవర్నర్ ప్రసంగం జరిగేటప్పుడు సభలో వైసీపీ సభ్యులు గొడవ చేసి, కేకలు పెట్టి, కాగితాలు చింపి పైన వేసి అసభ్యంగా ప్రవర్తించారని తూర్పారబట్టారు. కంపెనీలు రాకూడదు..అభివృద్ధి జరగకూడదు...ఇదే వైసీపీ విధానంగా ఉందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థల్ని సర్వనాశనం చేసిన పరిస్థితిని చూశామని, కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో పెట్టుబడులు వస్తున్నాయని, అయితే పెట్టుబడులు రావడం వైసీపీ నేతలకు ఇష్టం లేదని సోమిరెడ్డి ఈ సందర్భంగా అసెంబ్లీలో వివరించారు.



రెడ్డి వృద్ధాశ్రమం
REDDY OLD AGE HOME
27/1/14, 3వ వీధి - రాంజీనగర్ (చిల్డ్రన్స్ పార్కు సాయిబాబా గుడి ఎదురు వీధి), నెల్లూరు.
చేరదలచిన వారు సంప్రదించండి. ఖాళీలు ఉన్నాయి.
బిరుదవోలు వెంకురెడ్డి
చైర్మెన్, వృద్ధాశ్రమం కమిటి, సెల్:98850 99885
అన్నెం సుధాకర్‌రెడ్డి
వైస్‌చైర్మెన్, సెల్ : 94410 84401
అనుమారెడ్డి శరత్‌రెడ్డి
కమిటీ సభ్యులు, సెల్: 93473 55075
తూపిలి శ్రీధర్‌రెడ్డి
కమిటీ సభ్యులు, సెల్ : 98666 48284
శ్రీమతి ఇ.ధనూజరెడ్డి
కమిటీ సభ్యురాలు, సెల్: 96769 82625






తృతీయ వర్ధంతి
మా ఇంటి దైవం, మా అభివృద్ధికి కారకులు
శ్రీ కొండా కోటారెడ్డి గారు
స్వర్గస్తులై తేది. 23.02.2026 సోమవారమునకు
మూడు సంవత్సరములు నిండుతున్న సందర్భముగా
వారి దివ్యస్మృతులను స్మరించుకుంటూ...
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ..
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.
కుమారులు - కోడళ్ళు
కొండా చంద్రమోహన్‌రెడ్డి - స్వర్ణలత
కొండా రవీంద్రరెడ్డి - అరుణ
మనుమలు, మనుమరాండ్రు, మునిమనుమలు, మునిమనుమరాలు
దామరమడుగు గ్రామం, బుచ్చిరెడ్డిపాళెం మండలం.

# బీజేపీపై పోరాడే సత్తా.. కాంగ్రెస్‌కే ఉంది


వై.యస్.ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వై.యస్.షర్మిల, కిరణ్‌కుమార్‌రెడ్డి

## • పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే సత్తా ఉన్న పార్టీ ఒక్క కాంగ్రెస్ మాత్రమేనని, కాంగ్రెస్ అధికారం లోకి వస్తేనే రాష్ట్రంలో స్వర్ణ యుగం సాధ్యమని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చెప్పారు. ఇటీవల ఆమె నెల్లూరుజిల్లా మనుబోలు మండలం, అక్కంపేటలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన 'ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర'లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని అడిగే నాథుడే లేరని, అన్ని పార్టీల ఎంపీలు బీజేపీకి బినామీలుగా తయారయ్యారంటూ విమర్శలు చేశారు.

**ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చారు :**

మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి, పేదప్రజల బతుకులతో చెలగాట మాడుతోందని ఆమె ధ్వజమెత్తారు. రాజ్యాంగబద్ధమైన పనిచేసే హక్కును బీజేపీ ప్రభుత్వం కాలరాసిందన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకానికి జాతిపిత మహాత్మా గాంధీ పేరు తొలగించడం దారుణమన్నారు. కేంద్రం నిర్ణయాలు గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు పని కల్పించడం కోసం కాక, కేవలం కాంట్రాక్టర్లు, మధ్యవర్తులకు మేలు చేయడానికే ఉపకరించే విధంగా ఉండడం విచారకరమన్నారు. తొలుత మాజీ ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలీ, గణేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## 'విశ్వసాయి' విద్యార్థికి ఆర్చరీలో ద్వితీయ స్థానం

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని విశ్వసాయి కళాశాలలో చదువుతున్న జి.దీపక్ కృష్ణ ఆర్చరీలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. ఇటీవల జరిగిన ఆలిండియా ఇన్విటేషనల్ యూత్ ఇన్‌డోర్ ఫీల్డ్ ఆర్చరలో చాంపియన్‌షిప్-2026లో ఆ విద్యార్థి ఇండియన్ బో విభాగంలో సింగిల్ స్పాట్, 5 స్పాట్, మిక్స్‌డ్ స్పాట్ విభాగాల్లో పాల్గొని ప్రథమస్థానం సాధించడంతో పాటు ఓవరాల్‌గా ద్వితీయ స్థానం సాధించాడని కళాశాల అధినేత డా.ఎన్.సత్యనారాయణ ఆ విద్యార్థిని అభినందించారు. విశ్వసాయి విద్యాసంస్థలు కేవలం చదువులకే పరిమితం కాకుండా, క్రీడలను కూడా ప్రోత్సహిస్తోందని ఆయన తెలిపారు. వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతో పాటు, మానసిక వత్తిడిని తగ్గించేందుకు క్రీడలు కూడా అవసరమన్నారు. కళాశాల డైరెక్టర్ శివసంకేత్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీసిటీలో.. రుద్రాక్ష వృక్షం వద్ద పూజలు


రుద్రాక్ష వృక్షం వద్ద ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 15న శ్రీసిటీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో శివుని దివ్య రూపంగా భావించే 'రుద్రాక్ష వృక్షం' వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పూజల అనంతరం ట్రిపుల్ ఐటి మరియు క్రియా యూనివర్సిటీ విద్యార్థులు సామూహిక భజనలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ధ్యాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పి.ఎస్.బి.శాస్త్రి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగగా, శ్రీసిటీ సోషియల్ ఇన్‌ఫ్రా విభాగానికి చెందిన అవినాష్ వేడుకల నిర్వహణను పర్యవేక్షించారు.

## అలరించిన చిన్నారుల భరతనాట్య ప్రదర్శన



శ్రీసిటీ సాహిత్య ఆధ్యాత్మిక వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన చిన్నారుల భరతనాట్య ప్రదర్శన అలరించింది. సూళ్ళూరుపేటలోని కెవిస్ కళానిలయం నిర్వాహకులు కంచర్ల సులోచన ఆధ్వర్యంలో చిన్నారులు ప్రణీత, హర్షిణి, హర్షితశ్రీ, జోష్నిక పలు భక్తి గీతాలకు భరతనాట్య ప్రదర్శనలు చేశారు. కళాబృందంలోని కంచర్ల చంద్రలేఖ, సిహెచ్ వంశీ ఆలపించిన అన్నమయ్య కీర్తనలు అందరి ప్రశంసలందుకున్నాయి. కళా బృందానికి శ్రీసిటీ-శ్రీవాణి నిర్వాహకులు జ్ఞాపికలు బహూకరించి సత్కరించారు. శ్రీసిటీ ప్రతినిధులు పల్లేటి బాలాజీ, పిఎస్‌బి శాస్త్రి పర్యవేక్షించారు.

---

# గూడూరు డివిజన్

## ఎల్ఏపి పబ్లిక్ స్కూల్‌కి.. 'అశోక భారత్ భూషణ్ సన్మాన్' పురస్కారం



అవార్డునందుకుంటున్న బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి

గూడూరులోని 'లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్' కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు నీతి అయోగ్ వారి ప్రతిష్టాత్మక 'అశోక భారత్ భూషణ్ సన్మాన్' అవార్డును కైవసం చేసుకుంది. ఈ నెల 14న మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డికి ఆ అవార్డును ప్రదానం చేశారు. గ్రామీణ భారతదేశంలో గత 40 సంవత్సరాలుగా అంకితభావంతో నాణ్యమైన విద్యను అందించడంలో లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ చేసిన సేవలకు గుర్తింపుగా వారికి ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ 'భారత్ భూషణ్ సన్మాన్' అవార్డు లభించడం తమకు గర్వకారణమని.. ఇంతటి గుర్తింపు దక్కడానికి మద్దతునిచ్చిన తన పాఠశాల బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు శ్రేయోభిలాషులకి ధన్యవాదాలు తెలుపుతూ ఆ అవార్డుని వారికి అంకితం చేస్తున్నానన్నారు.

## సుబ్రహ్మణ్యంరెడ్డికి సత్కారం


ఎల్ఏపి స్కూల్ ఎం.డి బుస్సారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డిని సత్కరిస్తున్న ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం

ప్రతిష్టాత్మక 'భారత్ భూషణ్ సన్మాన్' అవార్డును అందుకున్న సందర్భంగా లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ ఎం.డి బుస్సారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డిని ఈనెల 16వతేదీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం వారు సత్కరించి, అభినందనలు తెలిపారు. గ్రామీణ స్థాయిలో కార్పొరేట్‌లకు ధీటుగా ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించి దేశ స్థాయిలో ఎల్ఏపి స్కూల్ గుర్తింపు సాధించిందని వారు ఈ సందర్భంగా కొనియాడారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలకి అభినందనలు తెలిపారు.

## శ్యాంయాదవ్‌కి 'డైమండ్ వరల్డ్ అవార్డు'


అవార్డునందుకుంటున్న మయూరి శ్యాంయాదవ్

గూడూరుకి చెందిన ప్రముఖ సామాజికవేత్త, సేవాభిలాషి, శ్రీకృష్ణ సేవాసమితి ఫౌండర్ ఛైర్మెన్, జీవన్‌దాన్ ఆర్గాన్ డోనార్ డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యాంయాదవ్) అరుదైన 'డైమండ్ వరల్డ్ రికార్డ్'ని అందుకున్నారు. ఆయన చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఇటీవల తెలంగాణలో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ పార్లమెంటు సభ్యులు వేణుగోపాలాచారి, ఇంటర్నేషనల్ వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్‌కోఆర్డినేటర్ డాక్టర్ బింగి నరేందర్‌గౌడ్‌ల చేతులమీదుగా శ్యాంయాదవ్ ఆ అవార్డును అందుకున్నారు.

## కార్మికుల సంక్షేమానికి నిధులు కేటాయించలేదు


నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు, వారి సంక్షేమానికి నిధులు కేటాయించకపోవడం అన్యాయమని సిఐటియు నాయకులు విమర్శించారు. గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయం వద్ద ఈ నెల 16న వారు నిరసన కార్యక్రమం చేపట్టి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేవిధంగా ఉందే తప్ప, సామాన్యులకు మేలు జరిగేలా లేదన్నారు. నాయకులు జోగి శివకుమార్, పుట్టా శంకరయ్య, బి.వి.రమణయ్య, మణి, కోటేశ్వర రావు, గిరి తదితరులు పాల్గొన్నారు.


గూడూరుని జిల్లా చేయాలంటూ నినదిస్తున్న కంకణాల పెంచలనాయుడు

## జిల్లా చేయాలంటూ 72 రోజులుగా దీక్ష

గూడూరుని జిల్లా చేయాలంటూ భారత్ వికాస్ పరిషత్ సౌతిండియా నాయకుడు కంకణాల పెంచలనాయుడు ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని గాంధీబొమ్మ వద్ద చేపట్టిన రిలేదీక్ష ఈ నెల 15వ తేదీ నాటికి 72వ రోజుకు చేరుకుంది. ఎంతో చరిత్ర కలిగిన గూడూరును ముక్కలుగా చేయడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గూడూరును జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వెంకటసుబ్బయ్య, రాము, సుబ్బారెడ్డి, చిరంజీవి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## పని భారాన్ని తగ్గించాలి

### • నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపిన వీఆర్వోలు


తహశీల్దార్‌కి వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్వో సంఘ నాయకులు

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ రెవెన్యూ అధికారుల పనిభారాన్ని తగ్గించి, గత ప్రభుత్వం జరిపిన రీసర్వేలో పట్టాదారు పాస్‌పుస్తకాల్లో జరిగిన తప్పులను సవరించి రైతులకు అందించే విధంగా సమయం ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గూడూరు మండల వీఆర్వోలు నల్లబ్యాడ్జీలతో ఇటీవల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఆర్వోల సంఘం నాయకులు మాట్లాడుతూ పని ఒత్తిడిని తట్టుకోలేక కొంతమంది వీఆర్వోలు ఆత్మహత్యలకు పాల్పడడం జరిగిందని, ఉన్నతాధికారుల వైఖరికి ఈ సంఘటనలు అద్దంపడతాయని వారు విమర్శించారు. అనంతరం గూడూరు తహశీల్దార్ ప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు.

# నెల్లూరీయునికి భోపాల్‌లో అరుదైన గౌరవం

## సాయి చంద్రశేఖర్‌కి 'సాహిత్యశ్రీ' పురస్కారం




'సాహిత్యశ్రీ' అవార్డును అందుకుంటున్న సాయి చంద్రశేఖర్

మధ్యప్రదేశ్‌లోని భోపాల్ కేంద్రంగా 1966లో స్థాపించబడిన అరవై ఏళ్ళ అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి గుడ్లదొన సాయి చంద్రశేఖర్‌కి అరుదైన గౌరవం లభించింది. ఈనెల 17వతేదీ భోపాల్‌లో జరిగిన జాతీయ సభకు ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రతినిధిగా హాజరయ్యారు. సంస్థ జాతీయ అధ్యక్షులు డా. వీరేంద్రసింగ్, జాతీయ ప్రధానకార్యదర్శి కృతి చతుర్వేది, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య కె.సత్యమూర్తి చేతులమీదుగా భోపాల్ రాజ్‌సదన్‌లో ఆయన 'సాహిత్యశ్రీ' అవార్డును అందుకున్నారు. సాయి చంద్రశేఖర్ నెల్లూరీయులు కావడం విశేషం! నెల్లూరులోని శ్రీచైతన్య కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకులుగా సుదీర్ఘ కాలంగా సేవలందిస్తున్నారాయన. విద్యార్థి దశ నుంచే తెలుగు భాషా, సాహిత్యంపై ఆయన ఆసక్తితో రచనలు చేస్తున్నారు. ఇప్పటివరకు వెయ్యికి పైగానే వచన కవితలు, మరో వందకిపైగా పాటలు, అనేక లలిత గేయాలు రచించారు. 2024 సంవత్సరంలో జరిగిన అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ సంస్థ నుండి "సమన్వయ శ్రీ సన్మాన్" పురస్కారాన్ని కూడా అందుకున్నారు. ఇటీవల ఆయన 'నిశ్శబ్ద మాధుర్యం' అనే కవితా సంపుటిని కూడా ప్రచురించారు. భోపాల్‌లో పురస్కారం అందుకున్న సాయి చంద్రశేఖర్‌ని నెల్లూరుకు చెందిన పలువురు కవులు, సాహిత్యాభిమానులు అభినందించారు.

# పెరిగిపోతున్న.. మెడికల్ మాఫియాలు

## సీపీఐ నేత గుజ్జుల ఈశ్వరయ్య ధ్వజం



రాష్ట్రంలో ఆర్థిక అవినీతి కంటే రాజకీయ అవినీతి అధికంగా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరులోని రామకోటయ్య భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో మెడికల్ మాఫియా విచ్చలవిడిగా సాగుతోందంటూ ధ్వజమెత్తారు. మెడికల్ డ్రగ్స్ యంత్రాంగం ఏటా కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడుతూ, బోగస్ డ్రగ్స్ మాఫియాను పెంచి పోషిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 60వేల మందుల దుకాణాలు కొనసాగుతున్నాయని, అయితే అందులో బీఫార్మసీ – డిఫార్మసీ వంటి అర్హత కలిగిన వ్యక్తులు ఎంతమంది ఉన్నారో స్పష్టత లేదన్నారు. ఒకవైపు 30వేల మంది అర్హత కలిగిన వారు ఉండగా, మరో 30వేల మంది సర్టిఫికెట్లతో మందుల షాపులు నిర్వహిస్తున్నారని, దీనిపై డ్రగ్స్ కంట్రోల్ కార్యాలయం అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే వారు లేరన్నారు. అర్హత కలిగిన వారికి లేకుండా, అనర్హులు ఎంతోమంది అధికారుల అండదండలతో మందుల షాపులు కొనసాగిస్తున్నారని, అలాంటివారిపై చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి, సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య, మధు, మాలకొండయ్య, సిరాజ్, మున్నా, షానవాజ్, మున్నా, శంకర్ కిషోర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# 'వేద విజ్ఞాన వేదిక' వార్షికోత్సవం..22న

తమిళనాట తెలుగువారి వేదిక.. చెన్నై 'వేద విజ్ఞాన వేదిక' 16వ వార్షికోత్సవం ఈ నెల 22వ తేదీ సాయంత్రం 6గంటలకు జరుగనుంది. చెన్నై టీనగర్‌లోని ఆంధ్రాక్లబ్‌లో జరిగే ఈ కార్యక్రమంలో హైదరాబాదులోని శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపకులు.. పద్మభూషణ్ డా. కె.ఐ వరప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని తమ సందేశాన్ని వినిపించనున్నారు. ప్రముఖ చలనచిత్ర నటీమణి.. కూచిపూడి నృత్యకళాకారిణి కళారత్న ప్రభారమేష్ విశిష్టఅతిథిగా పాల్గొని సితార్ వాద్య నీరాజనంతో అందరినీ అలరించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రముఖ కర్ణాటక సంగీత గాత్ర కళాకారిణి.. సంగీత కళానిధి డా.శ్రీపాద పినాకపాణి మునిమనుమరాలు కుమారి భవ్య తూములూరు ఆధ్వర్యంలో 'సంగీత నీరాజనం' నిర్వహించనున్నారు. మరో ప్రముఖ కర్ణాటక సంగీత గాత్ర కళాకారిణి హిమబిందు చల్లాతో పాటు, వయొలిన్ విద్వాంసులు ఎస్. వెంకటసుందరం, మృదంగ విద్వాంసులు శ్యామకృష్ణ మల్లాజోస్యులతో కలిసి అద్భుతమైన రీతిలో ఈ సంగీత నీరాజనాన్ని సమర్పించనున్నారు. సాహిత్య, సంగీతాభిమానులందరూ విచ్చేసి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని వేద విజ్ఞాన వేదిక అధ్యక్ష కార్యదర్శులు జెకె రెడ్డి, కందనూరు మధు కోరుతున్నారు.



## మార్చి 10 నుంచి..

# ముత్యాలమ్మ జాతర

చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మార్చి10 నుంచి 3 రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. జాతరకు జిల్లా..రాష్ట్రం నుంచే కాక, తమిళనాడు–కర్నాటక తదితర ప్రాంతాల నుంచి కూడా ఏటా లక్షలాదిమంది భక్తజనం తరలివస్తున్న నేపథ్యంలో, ఈ సారి కూడా ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

## పల్లిపాడు 'డైట్‌'లో

# కళావిద్యపై వర్క్ షాప్



ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడులో ఉన్న ప్రభుత్వ డైట్‌లో ప్రథమ సంవత్సరం చదువుతున్న ఛాత్రోపాధ్యాయులకు ఇటీవల ఫెవిక్రిల్ కంపెనీకి చెందిన నెల్లూరుజిల్లా ఎక్స్‌పర్ట్ టీచర్ స్రవంతి ఆధ్వర్యంలో, కళాత్మక విద్యపై కార్యశాలను నిర్వహించారు. ఫాబ్రిక్ పెయింటింగ్ అంశంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రతి సంవత్సరం ఛాత్రోపాధ్యాయులకు పిడిలైట్ ఫెవికాల్ కంపెనీ వారి సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందని, అందుకు అవసరమైన సామగ్రి అంతా సంస్థ సమకూరుస్తుందని ఇన్చార్జి ప్రిన్సిపాల్ వి.అక్కిరెడ్డి తెలిపారు. అనంతరం ఛాత్రోపాధ్యాయులు తయారు చేసిన కళాత్మక అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ అధ్యాపకులు వి.రాధారాణి, యల్.నటరాజమూర్తి, జి.సుబ్బారావు, డి.హైమావతి, ఆర్ట్ ఎడ్యుకేషన్ ఉపన్యాసకులు కె.వి రామయ్య, కె.విజయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మద్యం

# ఏరులై పారుతోంది

**- ఐద్వా నాయకురాలి విమర్శ -**

రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని, బెల్టుదుకాణాలను అరికట్టే నాథులు లేరని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు శివకుమారి విమర్శించారు. ఈనెల 17న నెల్లూరులోని రామచంద్రారెడ్డిభవన్‌లో ఏర్పాటుచేసిన ఆ సంఘం జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల అమలులో వెనుకబడిందని, మద్యం అమ్మకాల్లో మాత్రం ముందుందని దుయ్యబట్టారు. ఆ సంఘం నాయకురాళ్ళు మస్తాన్‌బీ, పద్మ, సుబ్బమ్మ, శంషాద్, ప్రమీల, విజయమ్మ, సుజన పాల్గొన్నారు.

# విద్యార్థి విజయానికి నాలుగు సూత్రాలు

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

***విజయం అనేది ఒక్కసారిగా సంభవించే అద్భుతం కాదు. అది ప్రతి రోజూ మనం తీసుకునే పలు నిర్ణయాల సమాహారం. ఆత్మ నియంత్రణ, అలవాట్లు, క్రమశిక్షణ, దృష్టి.. విద్యార్థి విజయానికి నాలుగు సూత్రాలు.***

ఈ రోజుల్లో విద్యార్థుల జీవితాలు ఎన్నో దిశల్లోకి లాగబడుతున్నాయి. డిజిటల్ ప్రపంచం, సోషల్ మీడియా, పోటీ, ఒత్తిడి..ఇవన్నీ కలిసి విద్యార్థి దృష్టిని, సమయాన్ని, మనసును నిరంతరం పరీక్షిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తెలివి, ప్రతిభ, మార్కులు మాత్రమే భవిష్యత్తును నిర్ణయించవు. మనసును నడిపించే ఆత్మ నియంత్రణ, రోజును నిర్మించే అలవాట్లు, దిశను ఇచ్చే క్రమశిక్షణ, ఫలితాలను అందించే దృష్టి.. ఇవే నిజమైన మూలధనం. ఈ నాలుగు స్తంభాలు లేదా సూత్రాలు బలంగా ఉన్నప్పుడు విద్యార్థి ఏ రంగంలోనైనా ఎదగగలడు.

ఆత్మ నియంత్రణ అంటే.. మనసు ఎక్కడికి లాగితే అక్కడికి వెళ్లకుండా, మనం ఎంచుకున్న దిశలో దాన్ని నడిపించడం. తక్షణ ఆనందం కంటే దీర్ఘకాల ప్రయోజనాన్ని ఎంచుకోవడం. ఉదాహరణకు, పరీక్షలు దగ్గరగా ఉన్నప్పుడు ఫోన్‌లో స్క్రోల్ చేయాలనే కోరిక వస్తుంది. ఆ క్షణంలో మనసు చెప్పేది ఒకటి, భవిష్యత్తు కోరేది మరొకటి. ఆత్మ నియంత్రణ అంటే.. ఆ క్షణంలో సరైన నిర్ణయం తీసుకునే శక్తి. ఇది పుట్టుకతో రాదు. ఇది అభ్యాసంతో వస్తుంది. రోజుకు ఐదు నిమిషాలైనా మనసును ఒక పనిపై నిలబెట్టడం, చిన్నచిన్న డిజిటల్ విరామాలు పెట్టడం, చదువు తున్నప్పుడు ఫోన్‌ను దూరంగా ఉంచడం లాంటివన్నీ ఆత్మ నియంత్రణకు పునాది.

### అలవాట్లు క్రమశిక్షణను పెంచుతాయి :

అలవాట్లు మన జీవితాన్ని నడిపించే నిశ్శబ్ద శక్తి. మనం రోజూ చేసే చిన్న పనులు, కాలక్రమంలో పెద్ద ఫలితాలను ఇస్తాయి. ఉదయం లేచిన వెంటనే 20 నిమిషాల చదువు, రోజూ 30 నిమిషాల శారీరక వ్యాయామం, నిద్రకు ముందు 10 నిమిషాల రివిజన్..ఇవి చిన్నవిగా కనిపించినా, మెదడు పనితీరును, జ్ఞాపకశక్తిని, దృష్టిని గణనీయంగా పెంచుతాయి. అలవాట్లు ఏర్పడటానికి మూడు దశలు ఉంటాయి. సంకేతం, చర్య, ఫలితం. ఉదయం అలారం మోగడం సంకేతం, 20 నిమిషాల చదువు చర్య, ఆ తర్వాత వచ్చే చిన్న ఆనందం ఫలితం. ఈ చక్రం పునరావృతమవుతూ అలవాటుగా మారుతుంది. అలవాట్లు ఏర్పడిన తర్వాత చదువు భారంగా అనిపించదు; అది సహజంగా మారుతుంది. అలవాట్లు మనసును క్రమబద్ధం చేస్తాయి, లక్ష్యాలను చేరుకునే మార్గాన్ని సులభం చేస్తాయి.

### క్రమశిక్షణ ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది :

క్రమశిక్షణ అనేది శిక్ష కాదు..అది స్వేచ్ఛకు దారి తీసే మార్గం. క్రమశిక్షణ ఉన్న విద్యార్థి తన సమయాన్ని, శక్తిని, దృష్టిని సరిగ్గా వినియోగించగలడు. పరీక్షల సమయంలో సమయాన్ని ఎలా పంచుకోవాలి, ఏ విషయానికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి, ఏ పని ముందుగా చేయాలి..ఇవన్నీ క్రమశిక్షణతోనే సాధ్యమవుతాయి. క్రమశిక్షణ అంటే మనసును బలవంతంగా నియంత్రించడం కాదు; మన లక్ష్యాల కోసం మనమే మనకు ఇచ్చుకునే మాట. ఉదాహరణకు, రోజును నాలుగు లేదా ఐదు భాగాలుగా విభజించి, ప్రతి భాగానికి ఒక పని కేటాయించడం. ఒక పని పూర్తయ్యాక చిన్న విరామం తీసుకోవడం. చిన్న విజయాలకు చిన్న బహుమతులు ఇవ్వడం. ఇవన్నీ క్రమశిక్షణను పెంచే పద్ధతులు. క్రమశిక్షణ ఉన్న విద్యార్థి ఒత్తిడిలోనూ ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకోగలడు. క్రమశిక్షణతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. విద్యార్థి తన లక్ష్యాలపై నిలకడగా ముందుకు సాగుతాడు. అదేవిధంగా, 'దృష్టి' అనేది ఈ నాలుగు స్తంభాల్లో అత్యంత విలువైనది. ఈ కాలంలో దృష్టిని దొంగిలించడానికి ఒక నోటిఫికేషన్ చాలు. ఒక చిన్న డిస్ట్రాక్షన్ కూడా చదువు నాణ్యతను దెబ్బతీస్తుంది. దృష్టి అంటే ఒకేసారి ఒక పనిపై పూర్తిగా మనసుపెట్టడం. మల్టీటాస్కింగ్ అనేది మెదడును అలసటకు గురిచేస్తుంది; పనుల నాణ్యతను తగ్గిస్తుంది. దృష్టిని పెంచడానికి శాస్త్రీయ పద్ధతులు ఉన్నాయి. 25 నిమిషాల చదువు, 5 నిమిషాల విరామం అనే పద్ధతి మెదడును తాజాగా ఉంచుతుంది. చదువుకోడానికి ప్రత్యేక స్థలం ఉండటం, టేబుల్‌పై అవసరమైన వస్తువులే ఉండటం, మంచి వెలుతురు ఉండటం.. లాంటివి దృష్టిని పెంచుతాయి. శరీరానికినీరు, పండ్లు, బాదం వంటి ఆహారం ఇవ్వడం మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా, రోజుకు 7–8 గంటల నిద్ర దృష్టిని 40శాతం వరకు పెంచుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. దృష్టి ఉన్న విద్యార్థి తక్కువ సమయంలో ఎక్కువ నేర్చుకుంటాడు. ఈ నాలుగు స్తంభాలు పరస్పరం ఒకదానిని ఒకటి బలపరుస్తాయి. ఆత్మ నియంత్రణ అలవాట్లను ఏర్పరుస్తుంది. అలవాట్లు క్రమశిక్షణను పెంచుతాయి. క్రమశిక్షణ దృష్టిని బలపరుస్తుంది. దృష్టి ఫలితాలను అందిస్తుంది. ఈ చక్రం ఒకసారి ప్రారంభమైతే, విద్యార్థి జీవితంలో అద్భుతమైన మార్పులు వస్తాయి. పరీక్షల్లోనే కాదు, జీవితంలోనూ విజయాలు సాధించగలడు. ఈ వారం సందేశం ఒకటే..విజయం అనేది దూరంలో ఉన్న పర్వతం కాదు. అది ప్రతిరోజూ మనం వేసే చిన్న అడుగుల ప్రయాణం. ఆ ప్రయాణాన్ని నడిపించే శక్తి మనలోనే ఉంది. ఆ శక్తిని గుర్తించి, దాన్ని సక్రమంగా ఉపయోగించగలిగితే, విద్యార్థి జీవితంలో అసాధ్యం అనేది ఏదీ ఉండదు.



**వచ్చే వారం :** సమయ సామర్థ్యం : లక్ష్యాలను నడిపించే నిశ్శబ్ద శక్తి!

E-mail: reddyu@gmail.com

## జేఇఇ మెయిన్స్‌లో..

# 'డా.కిషోర్స్ రత్నం' ప్రభంజనం



ఈనెల 16న విడుదలైన జేఇఇ మెయిన్స్ ఫలితాలలో నెల్లూరులోని డా.కిషోర్స్ రత్నం జూనియర్ కాలేజీ విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకుంటూ అద్భుత విజయాలు సాధించారు. కె.వెంకట జివితేష్ 99.05 పర్సంటైల్ సాధించగా, వి.గౌతమ్ రెడ్డి 98.68, డి.భానుప్రకాష్ 97.58 పర్సంటైల్‌తో పాఠశాల ప్రతిష్టను ఇనుమడింప జేశారని విద్యాసంస్థల డైరెక్టర్లు డా. కృష్ణకిషోర్, వాసంతి కిషోర్, రోషిణి, అంబికా ఈశ్వర్, విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడులు ఆ విద్యార్థులను అభినందించారు. అకడమిక్ అడ్వయిజర్ నరసయ్యనాయుడు, ప్రిన్సిపాల్ కేవీడీ మనోజ్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 21 నుంచి..క్రికెట్ జట్ల ఎంపికలు

జిల్లాస్థాయి అండర్-19, 22 జిల్లా క్రికెట్ జట్ల ఎంపికలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగనున్నాయి. ఆసక్తి కలిగిన క్రీడాకరులు తెలుపురంగు డ్రస్‌కోడ్‌తో, సొంత క్రికెట్ కిట్, ఆధార్‌కార్డులతో ఆరోజు ఉదయం 8.30గంటల్లోగా హాజరు కావాలని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

# జొన్నవాడలో నేత్రపర్వంగా.. మహాశివరాత్రి వేడుకలు



వేద ఆశీర్వచనం అందుకుంటున్న సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారి దేవస్థానానికి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుండి రాత్రి వరకు ఆలయ ప్రాంగణం శివనామస్మరణతో మార్మోగింది. ఉదయం శ్రీ స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లఘున్యాస అభిషేకాలు నేత్రపర్వంగా జరిగాయి. వెండి రథంపై శ్రీ స్వామి-అమ్మవార్ల ప్రాకారోత్సవం, శ్రీ స్వామివారికి లింగోద్భవ కాల అభిషేకం, వెండి నంది సేవ, గ్రామోత్సవం, జాగరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక దర్శన క్యూలైన్లు, తాగునీటి సదుపాయం, మజ్జిగ చలివేంద్రం, ఉచిత ప్రసాద వితరణ, పాలు పంపిణీ, దాతల సహకారంతో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ఆలయ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



### స్వామి-అమ్మవార్లను దర్శించుకున్న సోమిరెడ్డి

శివరాత్రి పక్కరోజు సోమవారం నాడు మాజీమంత్రి సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జొన్నవాడ ఆలయానికి విచ్చేసి స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, పూజార్లచే వేదఆశీర్వచనం అందుకున్నారు.



# 'గెటప్' మురళిని అభినందించిన.. మంత్రి నారాయణ

'యాక్ట్ టాకీస్' కార్యక్రమం ద్వారా తెలుగు సినిమాల తెరవెనుక విశేషాలను తెలియజేసే ప్రముఖ టీవీ యాంకర్ శింగంశెట్టి మురళీ మోహన్‌రావు ఇటీవల మంత్రి నారాయణ ప్రశంసలు అందుకున్నారు. యాక్ట్ ఛానలో ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ వెంకటేష్, నాగార్జునలతో పాటు అనేకమంది నటులు, దర్శకుల వేషధారణతో ఇప్పటివరకు ఆయన దాదాపు 348 గెటప్పులు వేశారు. ఈ కార్యక్రమాన్ని గత 13 సంవత్సరాలుగా మురళి నిర్వహిస్తున్నాడు. తాను వేసిన గెటప్‌లతో ఇటీవల పోస్టర్‌లని మురళీ ప్రచురించాడు. ఆ పోస్టర్లను రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి డా. పొంగూరు నారాయణ ఆవిష్కరించి, ఆయన్ను అభినందించారు. మురళీమోహన్ రావు భవిష్యత్తులో ఉత్తమ అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ప్రముఖ సైకాలజిస్ట్ అభిషేక్ శింగంశెట్టి, కళాకారులు పాల్గొన్నారు.

## కన్నవారు - పుట్టిన ఊరు.. ఋణం తీర్చుకుంటున్న వరప్రసాద్‌రెడ్డి

# అమ్మా నాన్నల పేరుతో ఉచిత కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు!



శంకర నేత్రాలయ, చెన్నై, శాంతా - వసంతా ట్రస్టు, హైదరాబాదు సంయుక్త ఆధ్వర్యంలో తలపెట్టిన ఉచిత కంటి వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సల శిబిరం ఫిబ్రవరి 15వ తేదీ ఉదయం శివరాత్రి పర్వదినాన ప్రారంభమయ్యింది. తోటపల్లిగూడూరు మండలం ఇస్కపాళెం కూడలిలో నిర్వహిస్తున్న ఈ శిబిరం ఫిబ్రవరి 23 వరకూ 9రోజుల పాటు కొనసాగనుంది. శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపక ఛైర్మెన్ కోడూరు వరప్రసాద్‌రెడ్డి తమ తల్లితండ్రులు కీర్తిశేషులు కోడూరు వెంకటరమణారెడ్డి-శ్రీమతి శాంతమ్మల స్మృత్యంకంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. తమ స్వగ్రామం పాపిరెడ్డి పాళెం గ్రామ ప్రజలతో పాటు తోటపల్లిగూడూరు పరిసర ప్రాంత అన్ని గ్రామాల ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశారు. ఈ శిబిరాన్ని మాజీమంత్రి, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు.

**శిబిరాన్ని ప్రారంభించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి**




### పల్లె వాసులందరూ సద్వినియోగం చేసుకోవాలి

**- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**

ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన శాంతా బయోటెక్నిక్స్ ప్రారంభించిన 'పద్మభూషణ్' డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి మన జిల్లాకి, ముఖ్యంగా తోటపల్లిగూడూరు ప్రాంతానికి చెందిన వారు కావడం గర్వకారణం అన్నారు. ఆయన అమ్మా, నాన్నల జ్ఞాపకార్ధం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శంకర నేత్రాలయ వారి సారధ్యంలో కంటి పరీక్షలతో పాటు అవసరమైన శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా చేయడం అభినందనీయమన్నారు. కంటి అద్దాలని సైతం ఉచితంగానే అందిస్తున్నారని చెప్పారు. తోటపల్లిగూడూరుతో పాటు చుట్టుపక్కల పల్లెవాసులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### గ్రామీణ ప్రాంత ప్రజల కోసమే ఈ ఉచిత శిబిరం

**- డాక్టర్ కోడూరు వరప్రసాద్‌రెడ్డి**

డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజల సౌలభ్యం కోసం తాము ఈ ఉచిత కంటి వైద్య పరీక్షలతో పాటు శస్త్ర చికిత్సల శిబిరాన్ని నిర్వహించడానికి సంకల్పించామన్నారు. గ్రామాల్లో నివసించే చాలామంది పేదవారికి కార్పొరేట్ ఆసుపత్రులలో కంటి వైద్య పరీక్షలు అవసరమైన చికిత్సలు చేయించుకునే స్తోమత ఉండదని, అలాంటి వారి కోసమే ఈ సత్కార్యాన్ని శంకరనేత్రాలయ వారి సహకారంతో తలపెట్టామన్నారు. తమ అమ్మా, నాన్నలని సంస్మరించుకుంటూ 9 రోజులపాటు నిర్వహిస్తున్న ఈ శిబిరంలో పరీక్షల అనంతరం కావలిసిన మందులు, కంటి అద్దాలు అందించడంతో పాటు అవసరమైన వారికి కంటిపొర(క్యాటరాక్టు) ఆపరేషన్లు కూడా ఉచితంగానే చేస్తారని చెప్పారు. శస్త్ర చికిత్సల నిర్వహణ కోసం ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో ప్రత్యేకంగా రూపొందించిన వాహనాలలో అత్యంత ప్రావీణ్యులైన వైద్య బృందంతో ఈ ఆపరేషన్లు చేస్తారని చెప్పారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న వరప్రసాద్‌రెడ్డి

### విజయవంతంగా కొనసాగుతున్న శిబిరం!

ఫిబ్రవరి 15వతేదీ ఆదివారం నాడు ప్రారంభమైన ఈ ఉచిత కంటిపొర చికిత్సా శిబిరం విజయవంతంగా కొనసాగుతోంది. అధిక సంఖ్యలో రోగులు ఈ శిబిరానికి తరలివస్తున్నారు. ఫిబ్రవరి 19వ తేదీ అంటే 5వ రోజు మధ్యాహ్నం నాటికి 429 మంది గ్రామీణులకి పరీక్షలు జరపగా వారిలో 85 మందిని శస్త్రచికిత్సకి అర్హులుగా గుర్తించారు. 19వ తేదీ నుండి ఆపరేషన్లు కూడా మొదలుపెట్టగా తొలిరోజు 15 మందికి సర్జరీలు నిర్వహించారు. 9 రోజుల పాటు జరగనున్న ఈ శిబిరాన్ని కోడూరు కుటుంబసభ్యులు చంద్రశేఖరరెడ్డి, మురళీధర్‌రెడ్డి, మధుసూదనరెడ్డితో పాటు ఆనం మహేష్ రెడ్డిలు పర్యవేక్షిస్తున్నారు. "సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అన్న సూక్తి ఆదర్శంగా గ్రామీణ ప్రాంతవాసులకి, ముఖ్యంగా పేదవారికి ఉచిత కంటి వైద్యంతో పాటు శస్త్ర చికిత్సలని నిర్వహిస్తున్న శాంతా - వసంతా ట్రస్టు, శంకరనేత్రాలయ నిర్వాహకులు అభినందనీయులు.

# జిల్లాలో..6 మోడల్ సౌర గ్రామాలు!

## • కలెక్టర్ హిమాన్షుశుక్ల వెల్లడి



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద జిల్లాలో ఆరు గ్రామాలను మోడల్ సౌర గ్రామాలుగా అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చెప్పారు. ఈనెల 18న నెల్లూరు కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఈ విషయం తెలి పారు. గ్రామీణ ప్రాంతాల్లో సౌర రూఫ్ టాప్ వ్యవస్థలను ప్రోత్సహించడం కోసం 5 వేల మందికి పైగా జనాభా కలిగిన గ్రామాలను మోడల్ సౌర గ్రామాలుగా పరిగణనలోకి తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో తొలి విడత మోడల్ సౌర గ్రామాలుగా లేగుంటపాడు, బిట్ర గుంట, మహిమలూరు, కలివెలపాళెం, మనుబోలు, కాకుపల్లి గ్రామాలను ఎంపిక చేసినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ గ్రామాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఒక గ్రామాన్ని జిల్లాలో మోడల్ సౌర గ్రామంగా కూడా ఎంపిక చేసి, ప్రోత్సా హంగా కేంద్రప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేస్తుందని వివరించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, విద్యుత్ శాఖ ఎస్ఇ రాఘవేంద్ర పాల్గొన్నారు.

## మరో 9 ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు

జిల్లాలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు(వాతావరణ కేంద్రాలు) రైతులకు, ప్రజలకు సమయానుకూల వాతావరణ సమాచారాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. బుధవారం ఇందుకూరుపేట మండలం కొరుటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 9 నూతన ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాతావరణ అంచనాల ఆధారంగా పంటల సాగు, ఎరువుల వినియోగం, పురుగుమందుల పిచికారీ వంటి వ్యవసాయ కార్యకలాపాలను రైతులు సమర్థవంతంగా నిర్వహించుకోవచ్చని

## జేఇఇ మెయిన్స్‌లో.. సత్తాచాటుకున్న 'రెయిన్‌బో' విద్యార్థులు



జేఇఇ మెయిన్స్-2026 ఫలితాల్లో నెల్లూరురూరల్‌లోని రెయిన్‌బో సీబీఎస్ఇ సెకండరీ స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటుకుంటూ అత్యుత్తమ ఫలితాలు సాధించారు. కలికి హర్షిత్ 99.65 పర్సంటైల్ సాధించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. అదేవిధంగా సేగు మహాలక్ష్మి 94.24, ఉడాలి లక్ష్మీప్రసన్న జ్యోత్స్న 93.95, షేక్ అఫ్రోజ్ రఫియా 92.94, ప్రాప్తి జైన్ 92.80, ఈదూరు లక్ష్మీ సంప్రిత 91.37 పర్సంటైల్‌తో ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల రెయిన్ స్కూల్ డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల పాఠశాలలో జరిగిన కార్యక్ర మంలో ఆ విద్యార్థులను ఆమె అభినందించారు. స్కూల్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ యాని గోపకుమార్

## ఎన్జీఓ నేతకు సన్మానం

ఏపీ ఎన్జీవోల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ ఆధర్వంలో ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఇటీవల నూతనంగా ఎన్నికైన కిరణ్‌కుమార్‌ను, నెల్లూరులోని ఎన్జీవో హోమ్‌లో సన్మానించారు.

## ఆకట్టుకున్న..దారపు కళాఖండాలు



తులసిరెడ్డికి శ్రీకృష్ణదేవరాయలు ప్రతిమను అందజేస్తున్న డా. శివశంకరయ్య

కడప జిల్లా బ్రహ్మంగారి మఠం సమీపంలోని తోటపల్లి అంచులానందస్వామి ఆశ్రమం వద్ద ఇటీవల జరిగిన శ్రీకృష్ణ దేవరాయ కవితా సమ్మేళనం సందర్భంగా, నెల్లూరుజిల్లా కలువాయి మండలం చిలకలమర్రి జడ్పీహైస్కూలుకు చెందిన తెలుగు ఉపా ధ్యాయుడు..చరిత్రపరిశోదకుడు, ప్రముఖ దారపు శిల్పి డా. మున్నెల్లి శివశంకరయ్య నూలు దారాలతో తాను రూపొందించిన శ్రీకృష్ణదేవరాయలు ప్రతిమలను ముఖ్య అతిథులకు బహుకరిం చారు. ఆశ్రమ ప్రముఖులు శ్రీ విరజానందస్వాములవారు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తులసీరెడ్డి, రాజంపేట మెజిస్ట్రేట్ పి.శివశంకర్ తదితరులు ఒకే దారంతో రూపొందించిన ఆ అద్భుత కళా ఖండాలను చూసి.. ఈ కళ దైవదత్తమని, విద్యార్థులకు కూడా నేర్పించాలని తులసిరెడ్డి డా.శివశంకరయ్యకి సూచించారు.

## కన్నులపండువగా స్వర్ణలింగేశ్వరుని..కళ్యాణం!



నెల్లూరులోని స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ వద్ద ఉన్న శ్రీ స్వర్ణ లింగేశ్వర స్వామివారి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని కన్నుల పండువగా వేడుకలు జరిగాయి. సోమ వారం సాయంత్రం శ్రీ భవాని సమేత శ్రీ స్వర్ణలింగేశ్వరస్వామి వారి కళ్యాణ మహో త్సవం సంప్రదాయబద్ధంగా జరిగింది. ప్రముఖ వేదపండితులు వేదగిరిఫణి శర్మ, ఇసుకపల్లి యశ్వంత్‌కుమార్‌శర్మ, విజయ్‌కుమార్‌శర్మల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. గణపతి పూజ అనంతరం, భరతనాట్యం, కోలాటాలు, సంగీత నాదార్చనలతో స్వామివార్ల కల్యాణోత్సవం భక్తులకు నేత్రపర్వం చేసింది. ఆ తర్వాత స్వామివారికి-అమ్మవారికి పుష్పాభిషేకం కార్యక్రమాలు వేడకగా నిర్వహించి, శ్రీ స్వర్ణ లింగేశ్వర స్వామివారి నగరోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు.

## వీఆర్‌సి వాకర్స్ అన్నదానం



నెల్లూరులోని వీఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఈనెల 17న ఉచిత సేవా శిబిరం నిర్వహించారు. శ్రీ సత్యసాయి అక్షయ సేవాట్రస్ట్‌లో ప్రభుత్వాసుపత్రిలోని రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. వాకర్స్ 203-జిల్లా గవర్నర్ నలుబోలు బలరామయ్యానాయుడు, వాకర్స్ ప్రతినిధులు గడ్డం సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. నళినీ మోహన్, తులసి వెంకటేశ్వర్లు, జి. లక్ష్మణకుమార్‌రెడ్డి, కె.సుభాషిణి, శంకర్‌రెడ్డి, ఏ.హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## కైలాసనాథునికి..శివరాత్రి పూజలు



గూడూరు మండలం తిప్పవరప్పాడు గ్రామంలోని శ్రీ కామాక్షిదేవి సమేత శ్రీ కైలాసనాథ స్వామివారి దేవస్థానంలో ఇటీవల మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకరణలు చేసి, పూజలు నిర్వహిం చారు. అనంతరం, మంగళ వాద్యాలు వేదమంత్రాలతో శివపార్వతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని 'ఓం నమశ్శివాయ' నామస్మరణ చేస్తూ స్వామివార్ల కళ్యాణాన్ని తిలకించారు. బత్తల సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్ర మాలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

## టూకీగా...



### చెర్లోపల్లిలో ఉచిత ఆయుర్వేద శిబిరం

మనుబోలు మండలం చెర్లోపల్లిలో ఈనెల 18న ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. మడమనూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి జగదీశ్వరి రోగులను పరీక్షించి, ఉచి తంగా మందులు అందజేశారు. ఆయుర్వేదం ద్వారా ఎన్నో నయం కాని జబ్బులు సైతం నయమవుతున్నాయని ఆమె చెప్పారు. సీపీఎం నాయకుడు దేవదానం తదితరులు పాల్గొన్నారు.

### విడవలూరులో విద్యార్థులకు రక్తగ్రూప్ నిర్ధారణ

విడవలూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో, జూనియర్ రెడ్‌క్రాస్ వారు విద్యార్థులకు పరీక్షలు చేసి, రక్తగ్రూప్ నిర్ధారణ కార్డులను అందజేశారు. మనసేవ సంస్థ వ్యవస్థాపకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రమేష్, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

### బిట్రగుంటలో రక్తదానం

బోగోలు మండలం బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో ఈనెల18న ఆలిండియా గార్డ్స్ కౌన్సిల్ 61వ వార్షికోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పలువురు రక్తదానం చేశారు. బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్, రైల్వే పెన్షనర్ల అసోసియేషన్, ఆలిండియా గార్డ్స్ కౌన్సిల్, రైల్వేఎంప్లాయిస్ సంఘల సహకా రంతో నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీవారు ఈ శిబిరం నిర్వహించారు.

### కావలిలో మునిసిపల్ పాఠశాలల తనిఖీ

కావలి పాత ఊరులోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలను ఈనెల 18న మండల విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. టెన్త్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, కష్టపడి చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని చెప్పారు. ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలిచ్చారు.

### రామసాగరంలో.. బాల్యవివాహాల దుష్ఫలితాలపై అవగాహన

సైదాపురం మండలంలోని రామసాగరం హైస్కూల్ విద్యార్థులకు ఈనెల 18న రాపూరు సీడీపీఓ సునంద ఆధ్వ ర్యంలో, బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కలిగించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్త లను వివరించారు. సోషల్ కౌన్సిలర్ కమల, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధనమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఆత్మకూరులో..వెట్టిచాకిరి నిర్మూలన పోస్టర్ల ఆవిష్కరణ

వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టం స్వర్ణోత్సవ వాల్‌పోస్టర్ లను ఆత్మకూరులో ఈనెల 18న ఆర్డీఓ పావని ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. వెట్టిచాకిరి చేయించుకోవడం నేరమని, ప్రతి వ్యక్తి స్వేచ్ఛగా జీవించాలని చెప్పారు. మేరా యువ భారత్ జిల్లా యూత్ అధికారి ఏ.మహేంద్రరెడ్డి, సేవాసంస్థల ప్రతి నిధులు వి.శ్రీహరి, పీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

### అనంతసాగరంలో ఉపాధి హామీ పనుల సమీక్ష

అనంతసాగరంలోని ఎండిఓ కార్యాలయంలో ఈనెల 18న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఏపీఓ సుబ్బరాయుడుల ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి పని పార దర్శకంగా జరగాలని, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

### బండ్లపాళెంలో బాధితురాలికి జనసేన సాయం

ముత్తకూరు మండలం బండ్లపాళెంలో.. శరీరంపై ప్రమా దకరమైన గడ్డలతో బాధపడుతున్న ఓ పేద బాలికకు చికిత్స కోసం సర్వేపల్లి నియోజకవర్గం జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌బాబు ఈనెల 18న 20వేల రూపాయలు సాయంగా అందజేశారు. బాలిక కుటుంబసభ్యులు, జనసైనికులు పాల్గొన్నారు.

### కోటలో విఆర్‌ఓల నిరసన

వృత్తిరీత్యా అధికమవుతున్న పనిభారం తగ్గించాలని ప్రభు త్వాన్ని కోరుతూ, మండల కేంద్రమైన కోటలో విఆర్‌ఓలు ఈనెల18న ఆందోళన చేశారు. మండల విఆర్‌ఓల అసోసియే షన్ ఆధ్వర్యంలో భోజనవిరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలియజేశారు. సంఘం నాయకులు పూడి కృష్ణయ్య, చిరంజీవి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రద్ధాంజలి



16.02.1933 - 23.02.2021

ఆదర్శమూర్తి, ఆత్మీయదీప్తి, మా కుటుంబ కీర్తి

## కీ॥శే॥ గునుపాటి హరిశ్చంద్రారెడ్డి గారు

పరమపదించి ఫిబ్రవరి 23, 2026 నాటికి ఐదేళ్ళు గడవనున్నాయి.
వారి 5వ వర్ధంతి సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ
**శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం.**

**గునుపాటి శ్యామల** - భార్య

**గునుపాటి పార్వతి** - కుమార్తె

**గునుపాటి వెంకటేశ్వరప్రసాద్** - కుమారుడు

**గునుపాటి అనూరాధ** - కోడలు

మనుమళ్ళు, మనుమరాళ్ళు

**దామోదర్ - ఇందిర - సంజన - మల్లిక - శరత్**

Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com